మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 1-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 333 Issue: 333

01 జూన్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి పాడ్యమి సా. 4:37 వరకు తరువాత విదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం జ్యేష్ఠ రా. 7:01 వరకు తరువాత మూల యోగం సిద్ధ ఉ. 6:11 వరకు కరణం కౌలవ సా. 4:37 వరకు తైతుల తె. 5:490 వరకు వర్జ్యం తె. 4:07 నుండి తె. 5:55 వరకు దుర్ముహూర్తం మ. 12:39 నుండి మ. 1:31 వరకు మ. 3:15 నుండి సా. 4:07 వరకు రాహుకాలం ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు యమగండం ఉ. 10:36 నుండి మ. 12:14 వరకు గుళికాకాలం మ. 1:51 నుండి మ. 3:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు ఉ. 9:14 నుండి ఉ. 11:02 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## ఆర్సీబీనే తలా

ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మళ్ళీ కప్పు కొట్టేసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి కప్పు సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆర్సీబీ వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన జట్టుగా నిలిచింది.



## బ్యాడ్మింటన్‌లో భళా

భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించింది. సింగపూర్ ఓపెన్ టోర్నీలో సంచలన ప్రదర్శనతో అదరగొట్టిన ఈ భారత జంట పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తమ కెరీర్‌లో సింగపూర్ ఓపెన్ విజేతగా నిలవడం కూడా ఇదే తొలిసారి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో సాత్విక్ జోడీ 18-21, 21-17, 21-16 తేడాతో ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్-ముహమ్మద్ ఫిక్రి ద్వయాన్ని ఓడించింది.



## పేలుడు ధాటికి 45 మంది మృతి

### మరో 70 మందికి గాయాలు

### ఈశాన్య మయన్మార్‌లో ఘటన

బ్యాంకాక్: ఈశాన్య మయన్మార్‌లో ఆదివారం మధ్యాహ్నం ఓ భవనంలో ఘోర పేలుడు ప్రమాదం సంభవించింది. గనుల తవ్వకాల కోసం నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు ఒక్కసారిగా పేలిపోవడంతో 45 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 70 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,851 |

## ప్రమాదపుటంచున ప్రపంచం

# అదిగో... ఆర్థిక మాంద్యం!





### పశ్చిమాసియా యుద్ధం తీవ్రత

## నిపుణుల ఆందోళనలు

పశ్చిమాసియాలో శాంతి ఒప్పందాల ప్రయత్నాలు విఫలమవడంతో అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు మరింత కమ్ముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కఠిన షరతుల నేపథ్యంలో ఈ సంక్షోభం మరింత సుదీర్ఘంగా సాగేలా కనిపిస్తోంది. కీలకమైన హర్మూజ్ జలసంధి మూసివేత భయాలు, ఇంధన ధరల పెరుగుదల వల్ల ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక మాంద్యం దిశగా అడుగులు వేస్తున్నాయని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వాషింగ్టన్: పశ్చిమాసియాలో శాంతి ఒప్పందం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాము ఎలాంటి అణు ఆయుధాలను తయారు చేయబోమని ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి తన కోడలు లారా ట్రంప్ నిర్వహించిన 'ఫాక్స్ న్యూస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'నాకు కావలసిన ఒకే ఒక్క గ్యారెంటీ, ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేయకూడదు. అందుకు వారు అంగీకరించారు, ఇది చాలా ఆసక్తికరమైన విషయం' అని పేర్కొన్నారు. మరోవైపు, న్యూయార్క్ టైమ్స్, యాక్సియోస్ మీడియా సంస్థల కథనాల ప్రకారం.. శాంతి ఒప్పందం పేరిట ట్రంప్ ఇరాన్‌కు అత్యంత కఠినమైన నిబంధనలతో కూడిన కొత్త ప్రతిపాదనలను పంపారు. అయితే ఈ కొత్త షరతుల కారణంగా పశ్చిమాసియాలో అధికారికంగా యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి పట్టే మరింత సమయం పట్టే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ముగింపు ఒప్పందంలో భాగంగా 'లెబనాన్'ను కూడా చేర్చాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇజ్రాయెల్ దళాలు దక్షిణ లెబనాన్‌లోకి 30 కిలోమీటర్ల మేర చొచ్చుకెళ్లి దాడులను తీవ్రం చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ డిమాండ్ తెరపైకి తరువాయి 2 వ పేజీలో...



## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!

### డిజిటల్ మార్కెటింగ్ రంగంలో కొత్త మైలురాయి

డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హిందవేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. హిందవేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్.

న్యూఢిల్లీ: వినియోగదారులు గూగుల్‌లో హిందవేర్ అని వెతికినప్పుడు, హిందవేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హిందవేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే. గూగుల్ యాడ్ వర్డ్స్ (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఆస్ట్రేలియా వైద్య రంగంలో ఒక వినూత్న ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. సిడ్నీలోని లివర్‌పూల్ హాస్పిటల్‌లో దేశంలోని తొలి ఎంఆర్ఐ మార్గదర్శక క్రయోఅబ్లేషన్ యంత్రాన్ని ప్రారంభించింది. ఈ సాంకేతికత ద్వారా శస్త్రచికిత్స అవసరం లేకుండానే కణితులను (ట్యూమర్లను) గడ్డకట్టించి నాశనం చేయడంతో పాటు రోగుల నొప్పిని కూడా తగ్గించవచ్చు.

# శర్బత్.. లస్సీ.. ఆమ్ పన్నా

## ఎండలను తట్టుకోవడానికి మోదీ టిప్స్

### దేశీయ పానీయాలు తాగాలని సూచన.. మన్ కీ బాత్ వేదికగా కీలక వ్యాఖ్యలు



దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 134వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశంలో నెలకొన్న ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రత్యేకంగా మాట్లాడారు. వేసవి తీవ్రత నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రభుత్వ విభాగాల నిబంధనలు పాటించడంతో పాటు శరీరాన్ని చల్లబరిచే సాంప్రదాయ దేశీయ పానీయాలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలోని అత్యధిక ప్రాంతాలు భానుడి భగభగలకు అల్లాడిపోతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం చాలా అవసరం. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు తగినంత నీరు తాగుతూ, శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఎండల్లో బయటకు వెళ్లేటప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోండి. వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేస్తున్న వాతావరణ మార్గదర్శకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దు" అని పీఎం మోదీ స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల వల్ల సాధారణ ప్రజల దైనందిన జీవితం ఎంతో దుర్భరంగా మారుతోందని, ఈ సమయంలో మనల్ని మనం కాపాడుకుంటూనే, చుట్టుపక్కల ఇబ్బంది పడుతున్న ఇతరుల పట్ల కూడా మానవత్వాన్ని, సహాయ గుణాన్ని చాటాలని ఆయన కోరారు. ఎండలను తట్టుకోవడానికి మన దేశంలో అనాదిగా వస్తున్న విభిన్న సంప్రదాయ పానీయాలను ఈ వేసవిలో భాగం చేసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. భారత దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, జీవన శైలిని ప్రతిబింబించే ఈ పానీయాలు కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఇవి 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' అనే ఐక్యతా స్ఫూర్తిని చాటుతాయని తరువాయి 2 వ పేజీలో...



# సర్‌తో జాగ్రత్త: కేటీఆర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. క్లాసిక్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుందని.. సర్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది.

హైదరాబాద్, మే 31 (ఈవార్తలు): 65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెలల్లో కేసీఆర్ చేసి చూపించారు. 24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు" అని కేటీఆర్ గుర్తు చేశారు. "వ్యవసాయానికి రోజుకు మూడు గంటల కరెంటు ఇస్తే చాలు అన్నా రేవంత్ రెడ్డి.. ఇప్పుడేమో రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడు. 35 వేల ఓటర్లు డిఫెన్స్ ల్యాండ్‌లో ఇల్లు కట్టుకున్నారు. వారి ఓటు హక్కు ఉండాలంటే సర్‌లో నమోదు చేసుకోవాలి. హైదరాబాద్‌లో మొత్తం బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించారు. గ్రామాల్లో రేవంత్ 420 మోసపూరిత హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంటే మనం నెత్తి మీద పెట్టుకున్నాం. ..సుమారు 2 లక్షల పట్టాలు తరువాయి 2 వ పేజీలో...




# నవంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు?

### ఆ దిశగా వేగంగా కసరత్తులు

### అక్టోబర్‌లో ముగియనున్న సర్ ప్రక్రియ

హైదరాబాద్, మే 31 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగర పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అప్డేట్ వచ్చింది. పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పాటైన మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో... అధికారులు వ్యూహాత్మకంగా మొదటగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఎన్నికల సమరాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నవంబరు నెలలోనే ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

1.6.2026

మేషం: అందరిలోనూ మీ మాటకు విలువ పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులు అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. నూతన ఋణయత్నాలు చేస్తారు. ప్రయాణాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. అనారోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. పనులలో శ్రమ తప్పదు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి.

మిధునం: కొన్ని పనులు వాయిదా వేస్తారు. శారీరక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఉద్యోగమున అధికారులతో వ్యతిరేకత పెరుగుతుంది.

కర్కాటకం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో ఒత్తిడులు తొలగుతాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు విశేషంగా రాణిస్తాయి. ఉద్యోగాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

సింహం: ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. వ్యాపారాలు ఆశించిన మేరకు రాణిస్తాయి. ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి.

కన్య: ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలు కొంత నిరుత్సాహపరుస్తాయి.

తుల: చిన్ననాటి మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలలో మార్పులు చేస్తారు. విద్యార్థుల కష్టానికి తగిన ఫలితం అందదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

వృశ్చికం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక లావాదేవీలలో చికాకులు తొలగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు ఉంటాయి. సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి. నూతన ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. వ్యాపారాలు నిదానిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు మరింత చికాకు పరుస్తాయి.

మకరం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు పొందుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: ఒక విషయంలో బంధువుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవచింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మీనం: ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

# అదిగో...ఆర్థిక మాంద్యం!

మొదటి పేజీ తరువాయి

తెచ్చింది. దీంతో పాటు వ్యాపార పరంగా అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా వెళ్లే ఓడలపై ఇరాన్ ఎలాంటి పన్నులు వసూలు చేయకూడదని ట్రంప్ ప్రతిపాదించగా, అలాంటి నిబంధన ఏదీ ఒప్పందంలో లేదని ఇరాన్ మీడియా సంస్థ 'ఫార్స్' కొట్టిపారేసింది. అంతేకాకుండా, సదరు జలసంధిపై తమ పూర్తి సార్వభౌమాధికారాన్ని చాటే బిల్లును ఇరాన్ పార్లమెంట్ త్వరలోనే ఆమోదించబోతోందని స్పష్టం చేసింది. తమ అణు కార్యక్రమంపై అమెరికాతో కీలక చర్చలు ప్రారంభించడానికి ముందే, గతంలో అమెరికా స్తంభింపజేసిన తమ 12 బిలియన్ డాలర్ల ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అదే సమయంలో, ఇరాన్ దగ్గర ఉన్న శుద్ధి చేసిన యురేనియంను నాశనం చేస్తామంటూ ట్రంప్ మునుపు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ అధికారిక వర్గాలు తోసిపుచ్చాయి. ట్రంప్ వాదనలపై టెహ్రాన్ (ఇరాన్) మొదటి నుంచి సందేహాలు వ్యక్తంచేస్తుండటంతో, కీలక ప్రాధాన్యతల విషయంలో ఇరు పక్షాల మధ్య ఇంకా చాలా వ్యత్యాసాలు కొనసాగుతున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఇరాన్–అమెరికా యుద్ధం మళ్లీ పూర్తి స్థాయిలో, మరింత భీకరంగా



ప్రారంభమయ్యే ప్రమాదం ఉందని యూఎస్ సైన్యానికి చెందిన కల్నల్ (రిటైర్డ్), రచయిత, రక్షణ వ్యవహారాల విశ్లేషకుడు డగ్లస్ అబోట్ మాక్‌గ్రెగర్ తెలిపారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాక్‌గ్రెగర్ మాట్లాడుతూ.. "అమెరికన్లలో ట్రంప్‌కి మద్దతు ఇచ్చే వాళ్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ప్రజాదరణ ఓట్లలో మూడో వంతు ఉన్నా, ఇప్పుడు అంతకంటే చాలా తక్కువగా ఉంది. అది సుమారు 20 శాతం స్థాయికి పడిపోయి ఉండొచ్చు. ప్రస్తుతం చాలా మంది అమెరికన్లు పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో (ఇరాన్, గల్ఫ్ దేశాలు, చమురు రవాణా మార్గాలు) జరుగుతున్న ఘర్షణలు, సైనిక చర్యలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ఎందుకంటే వాటి ప్రభావం ఇంకా వారి రోజువారీ జీవితంలో నేరుగా కనిపించడం లేదు. కానీ, అమెరికా చర్యల వల్ల చమురు సరఫరా దెబ్బతింటే, పెట్రోలు ధరలు పెరిగితే, ఇంధన కొరత వస్తే, ఆర్థిక సమస్యలు తలెత్తితే వాటి ప్రభావం అమెరికా ప్రజల జీవితాలపై నేరుగా పడుతుంది. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు, ఇప్పటివరకు ఆసక్తి చూపని అమెరికన్లు కూడా "పర్షియన్ గల్ఫ్‌లో ఏమి జరుగుతోంది?" అని గమనించడం ప్రారంభిస్తారు. చమురు, సహజ వాయు రంగాలకు చెందిన ప్రముఖులు స్పష్టంగా చెప్పారు.. ఎక్సాన్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు అయినా, ఇతర చమురు, ఆర్థిక విశ్లేషకులు అయినా ఒకే విషయం చెబుతున్నారు. మరో 3 నుంచి 8 వారాల్లో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు పూర్తిగా ఖాళీ అవుతాయని, అమెరికా తీవ్రమైన ఇబ్బందుల్లో పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, కాలిఫోర్నియా పర్షియన్ గల్ఫ్ నుంచి వచ్చే చమురు దిగుమతులపై చాలా ఆధారపడుతుందనే విషయాన్ని ఎవరూ అధ్యక్షుడు ట్రంప్‌కు చెప్పలేదు. ఇప్పుడు ఆ విషయాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ట్రంప్ అకస్మాత్తుగా యుద్ధం లేదా సైనిక చర్యలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించినా, సాధారణ అమెరికన్లలో ఎక్కువ మంది దానిని వ్యతిరేకించరు. అధిక శాతం మంది అమెరికన్లు దానిని బలహీనతగా చూడరు. యుద్ధం ముగిస్తే స్వాగతిస్తారు" అని తెలిపారు.

## పేలుడు ధాటికి 45 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది, స్థానిక మీడియా వెల్లడించాయి. చైనా సరిహద్దుకు కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న నామ్‌ఖామ్ పరిధిలోని 'కౌంగ్‌టుప్' గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల సమయంలో ఈ విస్ఫోటనం సంభవించింది. ఈ ప్రాంతం ప్రస్తుతం మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న 'తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ' అనే సాయుధ తిరుగుబాటు ముఠా ఆధీనంలో ఉంది. ప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే.. పేలుడు ధాటికి ఆకాశంలోకి దట్టమైన పొగ మేఘాలు కమ్ముకున్నాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ టీమ్.. ఆదివారం సాయంత్రానికి ఆరుగురు చిన్న పిల్లల మృతదేహాలతో సహా మొత్తం 46 మృతదేహాలను వెలికితీసి అంత్యక్రియల కోసం తరలించారు. గాయపడిన మరో 74 మందిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ పేలుడు తీవ్రత వల్ల చుట్టుపక్కల ఉన్న దాదాపు 100కు పైగా నివాస గృహాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంపై తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ తమ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పందించింది. గనులు, క్వారీ తవ్వకాల కోసం తమ ఎకనామిక్ డిపార్ట్‌మెంట్ ఈ భవనంలో 'జెలిగ్నైట్' అనే పేలుడు పదార్థాలను నిల్వ ఉంచిందని స్పష్టం చేసింది. సాధారణంగా జెలిగ్నైట్‌ను రాళ్లు బద్దలు కొట్టడానికి వాడతారు. అయితే దీనిని ఎక్కువ కాలం పాటు సరిగ్గా నిల్వ చేయకపోతే ఇది చాలా ప్రమాదకరంగా మారుతుంది. ప్రస్తుతం ఈ పేలుడు ప్రమాదానికి గల అసలు కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు స్థానిక యంత్రాంగం వైద్య సహాయం, పునరావాస చర్యలను అందిస్తోంది.

## సర్‌తో జాగ్రత్త: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ ఇచ్చారు.. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క ఇండ్ల పట్టాలు అయినా రేవంత్ ఇచ్చారా?. స్కూటీ లేదు లూటీ మాత్రం నడుస్తుంది. రైతుబంధు లేదు రాహుల్ బంధు నడుస్తుంది. రైతులకు యూరియా ఇచ్చే దిక్కు లేదు. ధాన్యం కొనే దిక్కు లేదు కానీ.. రైతులకు రైతు డిస్కం తెస్తారంటా?. రైతులకు ఊరి వేయడానికే రైతు డిస్కం తెస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లో 95 లక్షల ఓట్లు సర్ పేరుతో తీసేశారు.. కోర్టుకు వెళ్లారు.. కోర్టులో ఉండగానే ఎన్నికలు జరిగాయి బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారు. అందరూ సర్‌లో పాల్గొని.. మన ఓట్లు తొలగించకుండా మనం అప్రమత్తంగా ఉండాలి" అని కేటీఆర్ సూచించారు

## శర్బత్.. లస్సీ.. ఆమ్ పన్నా

మొదటి పేజీ తరువాయి

కొనియాడారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలను ఆయన ప్రస్తావించారు. ఉత్తర భారతదేశంలో లభించే 'ఆమ్ పన్నా' (పచ్చి మామిడికాయ రసం) ఎండ దెబ్బ తగలకుండా రక్షిస్తుందన్నారు. అలాగే పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పెద్ద పెద్ద గ్లాసులతో తాగే 'లస్సీ' శరీరానికి చలవ చేస్తుందని చెప్పారు. అంతేకాకుండా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల ప్రజలు తమ ప్రతి భోజనంలోనూ 'మజ్జిగ'ను తప్పనిసరిగా భాగం చేసుకుంటారని గుర్తు చేశారు. బీహార్, జార్ఖండ్, తూర్పు యూపీ ప్రాంతాల్లో తాగే 'సత్తు శర్బత్' (వేయించిన శనగపిండి పానీయం) కడుపు నింపడమే కాకుండా తక్షణ శక్తిని ఇస్తుందన్నారు. కొంకణ్, గోవాలో దొరికే 'కోకం శర్బత్', 'సోల్ కఢి'లు కూడా ఆరోగ్యానికి చాలా మంచివని చెప్పారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో లభించే 'పానకం', 'నీర్ మోర్', 'సంబారం' వంటివి వేసవికి ఎంతో మేలైనవని చెప్పారు. ఒడిశాలో ప్రత్యేకంగా తయారుచేసే 'బేలా పన్నా' (మారేడు పండ్ల రసం) ఆరోగ్యానికి ఎంతో మంచిదని వివరించారు. ప్రజలంతా ఈ వేసవి కాలంలో ఈ దేశీ పానీయాలను తాగి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మరోవైపు దేశంలో నెలకొన్న ఈ అసాధారణ ఉష్ణోగ్రతల ప్రభావం, నష్టాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రధాని మోదీ అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల మంత్రులను అప్రమత్తం చేశారు. వడగాల్పుల తీవ్రతను ఎదుర్కొనేందుకు, ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అవసరమైన అన్ని చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఈ కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. తీవ్రమైన ఎండల పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దేశమంత ఒకే తాటిపైకి వచ్చి 'హోల్ ఆఫ్ నేషన్' విధానంతో ముందుకు వెళ్లాలని ప్రధానమంత్రి గట్టిగా నొక్కిచెప్పినట్లు వెల్లడించారు. భారతీయ అథ్లెట్ల అద్భుత ప్రదర్శనలపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల రాంచీలో జరిగిన నేషనల్ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో మన క్రీడాకారులు సృష్టించిన రికార్డులను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గురిందర్‌వీర్ సింగ్, విశాల్ టికె, తేజస్విన్ శంకర్, దేవ్ మీనా, కుల్దీప్ కుమార్ వంటి క్రీడాకారులు సాధించిన మైలురాళ్లు దేశానికి గర్వకారణమని కొనియాడారు. ముఖ్యంగా 100 మీటర్ల స్ప్రింట్‌లో రెండు రోజుల్లోనే మూడుసార్లు జాతీయ రికార్డులు బద్దలవ్వడం, భారతీయ అథ్లెటిక్స్ ఎదుగుదలకు నిదర్శనమని ఆయన ఉద్ఘాటించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా గత ఎపిసోడ్ విశేషాలను కూడా ప్రధాని గుర్తుచేశారు. ఏప్రిల్ 27న జరిగిన 133వ ఎపిసోడ్‌లో నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ముఖ్యంగా, 'ఆర్కైవ్స్ వాల్ పోర్టల్' ద్వారా దాదాపు 20 కోట్ల చరిత్రక పత్రాలను డిజిటల్ రూపంలో సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం భారత చరిత్రను భద్రపరచడంలో ఒక గొప్ప అడుగు అని మోదీ అభివర్ణించారు.

## నవంబర్‌లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు?

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కసరత్తులు వేగవంతంగా సాగుతున్నాయి. ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుండటంతో, ఆ తర్వాతే అసలు ఎన్నికల హడావుడి అధికారికంగా మొదలుకానుంది. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఒక స్పష్టమైన కాలపట్టికను రూపొందించుకున్నారు. అక్టోబరులో తుది ఓటరు జాబితా చేతికి వచ్చిన వెంటనే దాని ఆధారంగా ఆయా డివిజన్లలో కొత్తగా ఏర్పడిన ప్రాంతాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు. దీనితో పాటు సమాంతరంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెనుకబడిన తరగతుల సర్వే నివేదికల డేటాను పరిశీలిస్తారు. ఈ సామాజిక–ఆర్థిక సర్వే రిపోర్టుల ఆధారంగానే డివిజన్ల వారీగా రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఖరారు చేస్తారు. వార్డుల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల వర్గీకరణ, రిజర్వేషన్ల ప్రక్రియ.. ఈ మూడు కీలకమైన ఘట్టాలు అక్టోబరు ఆఖరి నాటికి పూర్తి కానున్నాయి. ఇవన్నీ అనుకున్నట్లు సాగితే నవంబరు మొదటి లేదా రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, రాజధాని పరిధిలో మూడు కార్పొరేషన్లు ఉండగా.. తొలుత ఒక్క జీహెచ్‌ఎంసీకే ఎన్నికలు నిర్వహించడానికి బలమైన




కారణాలున్నాయని పొలిటికల్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సుమారు 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసి పరిపాలనా సౌలభ్యం కోసం మూడు నూతన కార్పొరేషన్లుగా పునర్విభజించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 10, 2026 నాటికే పాత జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు ముగిసిపోవడంతో ఫిబ్రవరి 11, 2026 న కొత్తగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు అధికారికంగా ఉనికిలోకి వచ్చాయి. ఈ మూడు సంస్థలకూ జీహెచ్‌ఎంసీ చట్టమే వర్తిస్తుంది. ఈ చట్టపరమైన నిబంధనల ప్రకారం.. పాత పాలకమండలి గడువు ముగిసిన ఆరు నెలల లోపల ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధన గతంలో ఉనికిలో ఉన్న పాత జీహెచ్‌ఎంసీకి మాత్రమే వర్తిస్తుండటం, మిగిలిన రెండు కొత్త సంస్థలు కావడం వల్ల వాటికి కొంత సమయం దొరికింది. మరోవైపు.. ఈ పునర్విభజన ప్రక్రియ ఓఆర్‌ఆర్ పరిధిలోని స్థానిక సంస్థల రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది. దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ మూడు కార్పొరేషన్లలో ఏ పార్టీ ఏ స్థానాన్ని కైవసం చేసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళం, అయోమయం నెలకొన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషిస్తే.. జీహెచ్‌ఎంసీలోని 150 డివిజన్లలో ఒక ప్రధాన పార్టీకి సుమారు 60 నుంచి 70 స్థానాలు దక్కే అనుకూల వాతావరణం ఉంది. మిగిలిన స్థానాల్లో మాత్రం ఊహించని విధంగా త్రిముఖ పోటీ తథ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. మొదట జీహెచ్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించి, అక్కడి ప్రజాభిప్రాయాన్ని, ఓటర్ల మూడ్‌ను క్షుణ్ణంగా విశ్లేషించుకున్న తర్వాతే.. సీఎంసీ, ఎంఎంసీల ఎన్నికలపై ముందడుగు వేయాలని పాలక పక్షం యోచిస్తున్నట్లు సమాచారం.

## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!

మొదటి పేజీ తరువాయి

పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హింద్‌వేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్‌ను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది. కోర్టు అభిప్రాయం ప్రకారం.. హింద్‌వేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు.

అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది. గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హింద్‌వేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు




చూపించడానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది. అంతేకాకుండా.. సమాచార సాంకేతిక చట్టం, 2000లోని సెక్షన్ 79 ప్రకారం తమకు సేఫ్ హార్బర్ రక్షణ వర్తిస్తుందని తెలిపింది. అయితే కోర్టు ఈ వాదనను తిరస్కరించింది. గూగుల్ ప్రకటనలను ప్రదర్శించడం మాత్రమే కాకుండా, ట్రేడ్‌మార్క్‌లను కీవర్డ్లుగా అమ్మి ఆదాయం పొందుతోందని గుర్తించింది. అందువల్ల గూగుల్ ఒక క్రియాశీల పాత్ర పోషిస్తోందని, సేఫ్ హార్బర్ రక్షణకు అర్హత లేదని తీర్పు చెప్పింది. ఈ కేసులో ప్రత్యర్థి సంస్థలుగా గ్రోహే ఇండియా, ఓంకార ఇన్ఫోవెబ్, సెరా శానిటరీవేర్ కూడా ఉన్నారు. వీరు హింద్‌వేర్ పేరును లేదా హింద్‌వేర్ శానిటరీవేర్ వంటి పదాలను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ ప్రకటనలను ప్రదర్శించారు. అయితే విచారణ సమయంలో ఈ సంస్థలు హింద్వేర్‌తో రాజీ చేసుకోవడంతో, చివరకు గూగుల్ మాత్రమే ఈ కేసులో మిగిలింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు భారతదేశంలోని డిజిటల్ మార్కెటింగ్ రంగానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఇప్పటి వరకు అనేక కంపెనీలు ప్రత్యర్థి బ్రాండ్ల పేర్లను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ వ్యాపారాలను ప్రోత్సహించేవి. ఇకపై అలాంటి చర్యలు ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉంది. నితిన్ కామత్ కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, తమ సంస్థకు ఇలాంటి సమస్యలు సంవత్సరాలుగా ఎదురవుతున్నాయని, ఇప్పుడు చట్టపరమైన పరిష్కారం పొందేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు.

# నీ ఏడుపే బీజేపీకి శాపం

**ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు**

హైదరాబాద్, మే 31 (ఈవార్తలు): తెలంగాణ బీజేపీలో విబేధాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా పాత నేతలు, కొత్త నేతల మధ్య గ్యాప్ ఉందంటూ వార్తలు వస్తున్న వేళ.. తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను టార్గెట్ చేస్తూ.. ఫ్లెక్సీలు వెలియడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఈ ఫ్లెక్సీలు అంటించి ఉండటం గమనార్హం. ఆ ఫ్లెక్సీలు సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడం, వార్తలు చక్కర్లు కొట్టడంతో.. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు రియాక్ట్ అయ్యారు. ఆ ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్ లక్ష్యంగా రాతలు ఉండటం గమనార్హం. 'నీ ఏడుపే బీజేపీకి శాపం' అనే హెడ్డింగ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదని.. కేంద్రమంత్రి పదవి దక్కలేదని ఈటల రాజేందర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంటూ ఆ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. ఈటల రాజేందర్‌కు 2 చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు.. రెండు చోట్ల ఓడిపోయిన తర్వాత కూడా మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ కూడా ఇచ్చింది బీజేపీ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గెలుపొందిన తర్వాత కూడా.. తన ఇమేజ్‌తోనే గెలిచాను అని ఈటల రాజేందర్ చెప్పడం రాజకీయ నైతికత కాదని ఆ ఫ్లెక్సీల్లో విమర్శలు గుప్పించారు. అదే సమయంలో బీసీ నాయకుడు ఎదుగుతుంటే అసహనం ఎందుకని.. ఎంపీ ధర్మపురి అరవింద్‌కు లభిస్తున్న ఆదరణను చూసి కడుపుమంట ఎందుకని అందులో ప్రశ్నించారు. తాను బీసీ నాయకుడిని.. తానే ప్రత్యామ్నాయం అనే భావన



నుంచి బయటకు రావాలని ఈటల రాజేందర్‌కు సూచిస్తూ ఫ్లెక్సీల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫ్లెక్సీలకు సంబంధించిన ఫోటోలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. అసలు వాటిని ఎవరు ఏర్పాటు చేశారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వెనుక ఉద్దేశం ఏంటి అనేది ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. ఈ ఫ్లెక్సీల వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న వేళ.. తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పందించారు. తెలంగాణలో రోజురోజుకూ బీజేపీ బలం పెరుగుతోందని ఓర్వలేక ఇతర పార్టీలకు చెందిన నేతలు, బయటి వ్యక్తులు ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. తమ పార్టీ నేతల మధ్య వివాదాలు రేపాలని కుట్రలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతలు కలిసికట్టుగా ఐక్యంగా పనిచేస్తున్నారని.. అందుకే పార్టీ గ్రాఫ్ పెరిగిందని తేల్చి చెప్పారు.

## భార్యను చంపింది భర్తే

**గొంతు కోసి ఆపై వేరే వాళ్ల చంపినట్లు చిత్రీకరణ**

**బొల్లారం మహిళ హత్య కేసులో బిగ్ ట్విస్ట్**

సికింద్రాబాద్, మే 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లో జరిగిన మహిళ హత్య కేసులో కీలక పరిణామం చేటు చేసుకుంది. సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారంలో మహిళను దుండగులు హత్య చేశారని భావించగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. భర్తే భార్యను అతి కిరాతకంగా హత్య చేసి.. ఆ తర్వాత దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చేశారని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు మృతురాలి భర్తను గట్టిగా విచారణ చేయగా.. తానే హత్య చేసినట్లు జరిగిన విషయం మొత్తం చెప్పాడు. ఈ నేపథ్యంలోనే అసలు భార్యను హత్య చేయడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనిల్, మీనా అనే దంపతులు బొల్లారంలో గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. శనివారం రోజున రాత్రి బొల్లారం పరిధిలోని నిర్మానుష ప్రాంతంలో మీనా అనే మహిళ దారుణ హత్యకు గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు తమపై దాడి చేసి తన భార్యను గొంతుకోసి చంపేశారని ఆమె భర్త అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్యను కాపాడేందుకు తాను అడ్డువెళ్లగా.. తనపై కూడా ఆ దుండగులు కత్తితో దాడి చేశారని పోలీసులకు వెల్లడించాడు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయాలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు చెప్పాడు. ఈ క్రమంలోనే మీనా భర్త అనిల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మీనా హత్య చేసింది దుండగులు కాదని.. ఆమె కట్టుకున్న భర్త అనిలేనని వెల్లడైంది. మీనా హత్యకు సంబంధించి.. ఆమె భర్త అనిల్ పోలీసులకు చెప్పిన విషయాలు పొంతన లేకపోవడంతో.. అతడిపైనా వారికి అనుమానం వచ్చింది. దీంతో అనిల్‌ను తమ స్టైల్‌లో విచారణ చేయగా అసలు నిజం బయటికొచ్చింది. అసలు తన భార్య మీనాను భర్త అనిల్ ఎందుకు హత్య చేశాడు అనే కోణంలో ఇప్పుడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మీనా, అనిల్ దంపతులు బొల్లారంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారని తెలుస్తోంది. అయితే వారిద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని ఇరుగు పొరుగు వారు చెబుతున్నారు. అయితే వారు ఈ మధ్యే కొత్త ఇల్లు కూడా కట్టుకున్నారని.. ఇలాంటి సమయంలో మీనా హత్య జరగడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అయితే మీనాను ఎందుకు అనిల్ హత్య చేయాల్సి వచ్చింది అనేది అతడి నుంచే రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. ప్రస్తుతం అనిల్ పోలీసుల అదుపులోనే ఉండగా.. విచారణలో హత్యకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులో రానున్నాయని పోలీసులు చెబుతున్నారు.

## కవిత వెనుక చంద్రబాబు?

**పార్టీ జెండా రంగులపై టీఆర్ఎస్ చీఫ్ క్లారిటీ**

హైదరాబాద్, మే 31 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త పార్టీతో ముందుకు వచ్చిన కల్వకుంట్ల కవిత .. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీకి చెందిన జెండాలో పసుపు రంగు ఉండటంపై మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. పసుపు రంగు అంటే తనకు చాలా ఇష్టమని.. భూమి పుట్టినప్పటి నుంచి పసుపు రంగు ఉందని పేర్కొన్నారు. కేవలం తెలుగుదేశం పార్టీకి మాత్రమే పసుపు రంగు సొంతం అని చెప్పడం అన్యాయమని తెలిపారు. నిజామాబాద్ జిల్లా ప్రజలకు పసుపు అంటే చాలా సెంటిమెంట్ అని కవిత స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో ఎక్కువ పండించేది పసుపు పంటేనని తేల్చి చెప్పారు. అంతేకాకుండా ప్రతీ ఆడబిడ్డకు పసుపు అంటే ఒక సెంటిమెంట్ అని తెలిపారు. ఆడబిడ్డలు తమ జీవితాంతం పసుపు, కుంకుమలు ఉండాలని కోరుకుంటారని కల్వకుంట్ల కవిత వెల్లడించారు. పసుపు అంటే వెలుతురు, సమృద్ధి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సమృద్ధిగా ఉండాలని తాను పసుపు రంగును తన జెండాలో పెట్టుకున్నట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి నుంచి తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించే స్థాయికి తాము ఎదిగామని అందుకే తన జెండా రంగులో జాగృతి జెండాలోని ఆకుపచ్చ రంగును కూడా తీసుకున్నట్లు వివరించారు. తెలంగాణ రైతుల కోసం, మైనారిటీ వర్గాలను కూడా తెలంగాణ రక్షణ సేన రిప్రెజెంట్ చేస్తుందని.. అందుకే ఆకుపచ్చ రంగుకు ఎంచుకున్నట్లు కవిత తెలిపారు. నీలి రంగు అనేది శ్రామికుల రంగు అని వెల్లడించారు. ఎస్సీలు, శ్రామిక వర్గాలు, సామాజిక తెలంగాణ కోసం తమ పార్టీ జెండాలో నీలి రంగు చేర్చినట్లు వివరించారు. కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీలో ఆకుపచ్చ రంగుతోపాటు పసుపు పచ్చ జెండాను ఎందుకు ఉంచారని అడిగిన ప్రశ్నకు




ఆమె సమాధానం ఇచ్చారు. కవిత కొత్త పార్టీ పెట్టడం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందని పలువురు బీఆర్ఎస్ నేతలు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. మరికొందరు టీఆర్ఎస్ పార్టీ స్థాపించడం వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఉన్నారని ఆరోపించారు. అయితే తన పార్టీ జెండాలోని పసుపు రంగుకు, పార్టీకి చంద్రబాబుకు, రేవంత్ రెడ్డి ఎలాంటి సంబంధం లేదని కవిత క్లారిటీ ఇచ్చారు. తనను ఎవరూ నడిపించడం లేదని.. తాను స్వతంత్ర్యంగానే రాజకీయాలు చేస్తున్నానని స్పష్టం చేశారు.

## 24 గంటల విద్యుత్తుపై ప్రకటనేది?

**చిట్‌చాట్‌లో చెప్పడం కాదు అధికారికంగా ప్రకటించాలి**

**రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర**

హైదరాబాద్, మే 31 (ఈవార్తలు): రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

**మీరిచ్చే ప్రతి పైసా..**
**ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**


ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS (with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines – Rs.450 (for each extra line – Rs.90)

COLOUR: Price for 5 Lines – Rs.500 (for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com





## రుతురాజ్ గైక్వాడ్‌కు

# బంపర్ ఆఫర్

శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత 'ఎ' జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్, అస్సాం స్టార్ ప్లేయర్ రియాన్ పరాగ్ గాయం కారణంగా లంక టూర్‌కు దూరమయ్యాడు. అతడి స్దానాన్ని మహారాష్ట్ర ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌తో బీసీసీఐ భర్తీ చేసింది. తిలక్ వర్మకు డిప్యూటీగా గైక్వాడ్ వ్యవహరించనున్నాడు. గైక్వాడ్ దాదాపు ఏడాది తర్వాత ఇండియా-ఎ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సీఎస్‌కే



కెప్టెన్ ప్రస్తుతం పేలవ ఫామ్‌తో సతమతవుతున్నాడు. ఐపీఎల్-2026లో రుతురాజ్ 14 మ్యాచ్‌లు ఆడి కేవలం 337 పరుగులు చేశాడు. అయితే రుతు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి ఈ టూర్ మంచి అవకాశం. ఇక పరాగ్ విషయానికి వస్తే.. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ఆరంభంలోనే హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ మధ్యలోనే గాయం కారణంగా మైదానాన్ని వీడాడు.ఆ తర్వాత కొన్ని మ్యాచ్‌లకు దూరమైనప్పటికీ, జట్టు ప్లేఆఫ్స్ రేసులో ఉండటంతో నొప్పితోనే తిరిగి జట్టులోకి వచ్చాడు. కానీ రాజస్తాన్ ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. అయితే ఇప్పుడు అతడు గాయం తీవ్రత ఎక్కువగా ఉ ండడంతో లంక పర్యటనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే రుతురాజ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అతడు చివరగా 2025లో ఇండియా-ఎ తరపున సౌతాఫ్రికా-ఎపై ఆడాడు. ఆ సిరీస్‌లో గైక్వాడ్ 210 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. కాగా లంక టూర్‌లో భాగంగా భారత్-ఎ జట్టు.. శ్రీలంక-ఎ, అఫ్గానిస్తాన్-ఎ టీమ్స్‌తో ముక్కోణపు వన్డే సిరీస్‌లో తలపడనుంది.

**శ్రీలంక సిరీస్ కోసం ఇండియా-ఎ జట్టు:**

తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ శెడ్గే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రజ్ నిగమ్, యష్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్.

## జీ-క్లాస్ కార్ల రీకాల్!

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్.. భారతదేశంలో తన కొత్త ఎలక్ట్రిక్ జీ-క్లాస్ కోసం అధికారికంగా రీకాల్ ప్రారంభించింది. కంపెనీ రీకాల్ ప్రకటించడానికి కారణం ఏమిటి?, ఈ ప్రభావం ఎన్ని కార్లమీద పడుతుంది? వీల్ బోల్ట్‌లకు సంబంధించిన సమస్య కారణంగా మెర్సిడెస్ బెంజ్ ఈ రీకాల్ ప్రకటించింది. దీని ప్రభావం 99 కార్లపై పడుతుంది. అంటే 99 కార్లకు రీకాల్ ప్రకటించారన్నమాట. కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు.. వీల్ బోల్ట్‌ల బిగింపు వల్ల, రానున్న రోజుల్లో వీల్ కనెక్షన్ వదులయ్యే అవకాశం ఉంది. దీనివల్ల వాహనం నడిపే స్థిరత్వం దెబ్బతినవచ్చు, ప్రమాదం జరిగే అవకాశం కూడా పెరగవచ్చు. కంపెనీ ప్రకారం.. 12 జూలై 2024, 18 ఆగస్టు 2025 మధ్య తయారైన మొత్తం 99 యూనిట్లు ఈ రీకాల్ వల్ల ప్రభావితమయ్యాయి. అధికారిక ప్రకటన ఏదీ జారీ చేయనప్పటికీ, ఈ సమస్యను కస్టమర్‌కు ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరించనున్నట్లు సమాచారం. అంతే కాకుండా.. కార్ల తయారీ సంస్థ సంబంధిత డీలర్‌షిప్‌ల ద్వారా ప్రభావితమైన కార్ల యజమానులను సంప్రదించే అవకాశం ఉంది.



## కొస్ట్యూక్ వరుసగా 16వ గెలుపు

**మాజీ నం.1 స్వియాటెక్ ఇంటి బాట**

ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. నాలుగుసార్లు చాంపియన్, మాజీ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ప్రిక్వార్టర్స్‌లో ఇంటిబాట పట్టింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన 15వ ర్యాంకర్ మార్తా కొస్ట్యుక్ చేతిలో 7-5, 6-1తో స్వియాటెక్ ఓటమి పాలైంది. గంటా 39 నిమిషాల పాటు సాగిన పోరులో కొస్ట్యుక్ 5 ఏస్‌లు సంధించగా.. స్వియాటెక్ సున్నా ఏస్‌లకు పరిమితమైంది. కొస్ట్యుక్ 25 విన్నర్లు సంధించగా, స్వియాటెక్ కేవలం 13 విన్నర్లకే పరిమితమైంది. గతంలో తలపడిన మూడుసార్లు ఓటమి పాలైన కొస్ట్యుక్ ఈసారి మాత్రం స్వియాటెక్‌పై పైచేయి సాధించింది. స్వియాటెక్‌ను ఎదుర్కొనే క్రమంలో కొస్ట్యుక్ గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడింది. ముఖ్యంగా మ్యాచ్‌లో కొస్ట్యుక్ గ్రౌండ్ స్ట్రోక్ విన్నర్స్‌తో అలరించింది. అయితే క్లే కోర్టుపై కొస్ట్యుక్ తన రికార్డును మరింత మెరుగుపరుచుకుంది. ఇప్పటివరకు క్లే కోర్టులో కొస్ట్యుక్ వరుసగా 16వ విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు ఫ్రాన్స్‌లో క్లే కోర్టులో టైటిల్ నెగ్గిన కొస్ట్యుక్ ఆ తర్వాత మాడ్రిడ్ టోర్నీ కూడా గెలుచుకుంది. మరోవైపు 2024 ఫ్రెంచ్ ఓపెన్ తర్వాత స్వియాటెక్ క్లే కోర్టులో మరో టైటిల్ గెలవలేదు. జూన్ 2న జరగనున్న క్వార్టర్ ఫైనల్లో కొస్ట్యుక్ ఏడో ర్యాంకర్ ఎలీనా స్వితోలినాను ఎదుర్కోనుంది.

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

బెంగళూరు: కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి టౌన్ సమీపంలోని జాతీయ రహదారి 44పై జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు బాగేపల్లి టౌన్ శివారులోని గంగోత్రి పెట్రోల్ బంక్ సమీపంలో తమ విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా, వేగంగా వచ్చిన ఒక ట్రక్కు వారి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోను ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



# మూడ్నెల్ల తర్వాత ఖమేనీ అంత్యక్రియలు!

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల నిర్వహణకు ఇరాన్ అధికారిక యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌లతో జరిగిన సుదీర్ఘ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు వాయిదా పడుతూ వచ్చిన ఈ అంతిమ సంస్కారాలను.. ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ ఎత్తున నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం పునాది వేస్తోందని అక్కడి అధికారిక మీడియా శుక్రవారం వెల్లడించింది. ఖమేనీ అంత్యక్రియలు నిర్వహించే ఖచ్చితమైన తేదీపై ఇంకా స్పష్టత రానప్పటికీ.. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయడానికి ఒక 'ప్రత్యేక ప్రధాన కార్యాలయాన్ని' ఏర్పాటు చేసినట్లు ఇరాన్ స్టేట్ టీవీ ప్రకటించింది. ఇస్లామిక్ ప్రచారానికి సంబంధించిన 'టెహ్రాన్ కోఆర్డినేషన్ కౌన్సిల్' అధినేత మొహసిన్ మహ్మూదీని ఉటంకిస్తూ.. ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ సంస్థలు, భద్రతా విభాగాలు ఈ అంతిమ యాత్రకు సంబంధించిన ప్రణాళికలు, ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరాన్ అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఈ మహా అంతిమ యాత్రను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మొహసిన్ మహ్మూదీ తెలిపారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు, ప్రపంచ దేశాల ప్రతినిధులు తరలివచ్చే అవకాశం ఉందని, అందువల్ల కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏప్రిల్ నుంచి ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. యుద్ధాన్ని పూర్తిగా ముగించే శాంతి ఒప్పందం మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఇరాన్ తన సర్వోన్నత నాయకుడికి తుది వీడ్కోలు పలకడానికి సిద్ధమవడం ఇప్పుడు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు దశాబ్దాలకు పైగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏకఛత్రాధిపత్యంగా నడిపించిన అయతొల్లా అలీ ఖమేనీ.. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మొదటి విడత వైమానిక దాడుల్లో మరణించారు. అంటే ఫిబ్రవరి 28వ తేదీ రోజునే ఆయన చనిపోయారు. ఆ దాడుల అనంతరం ఇరుపక్షాల మధ్య తీవ్రస్థాయిలో యుద్ధం రాజుకుంది. గత ఏప్రిల్ నెలలో ఖమేనీకి నివాళులు అర్పిస్తూ ఒక స్మారక కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ.. యుద్ధ వాతావరణం కారణంగా అప్పట్లో అధికారిక ప్రభుత్వ అంత్యక్రియలను నిర్వహించడం సాధ్యపడలేదు. ఈ దాడుల్లోనే ఖమేనీ కుమారుడు కూడా తీవ్రంగా గాయపడ్డారని వార్తలు వచ్చాయి. అయినప్పటికీ ఆయన్నే ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. అయితే బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఆయన ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బహిరంగంగా ప్రజల ముందుకు రాకపోవడం గమనార్హం.

# 'ధురంధర్' అక్షరాలా నిజం

**కరాచీ మాజీ మేయర్**




కరాచీ: బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' సిరీస్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన వేళ, పాకిస్థాన్‌కు చెందిన ఓ మాజీ మేయర్, జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆ చిత్రాలలో పాకిస్థాన్‌ను ప్రతికూలంగా చూపించారని కొందరు విమర్శిస్తున్న నేపథ్యంలో, అందులో చూపించిన ప్రతీ అంశం వాస్తవమేనని ఆరిఫ్ అజాకియా అనే పాక్ జర్నలిస్ట్ స్పష్టం చేశారు. అంతేకాదు, తాను పాకిస్థానీని కాదని, భారత మూలాలున్న వ్యక్తినని ప్రకటించి సంచలనం రేపారు. గతేడాది డిసెంబర్‌లో 'ధురంధర్', ఈ ఏడాది మార్చిలో దానికి సీక్వెల్ విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ. 3100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన విషయం తెలిసిందే. పాకిస్థాన్‌లోని కరాచీ నగరానికి చెందిన ల్యారీ ప్రాంతంలోని నేర సామ్రాజ్యాలు, వాటిపై భారత నిఘా వర్గాలు జరిపిన కౌంటర్-టెర్రరిజం ఆపరేషన్ల ఆధారంగా ఈ చిత్రాలను తెరకెక్కించారు. అయితే, ఈ సినిమాలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా రాజకీయ అజెండాతో రూపొందించారని కొన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ ఆరోపణలను ఖండిస్తూ ఆరిఫ్ అజాకియా ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన 'టాక్ జర్నలిజం 2026' కార్యక్రమంలో జర్నలిస్ట్ సౌరభ్ ద్వివేదితో మాట్లాడుతూ ఆరిఫ్ అజాకియా ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఏఎన్ఐ వార్తా సంస్థ పంచుకుంది. "సినిమాలో చూపించిన ల్యారీ ప్రాంతంలోనే నేను పుట్టి పెరిగాను. ఆ కాలంలో కరాచీలోని ఒక పట్టణానికి మేయర్‌గా కూడా పనిచేశాను. కాబట్టి, 'ధురంధర్' చిత్రంలో చూపించిన ప్రతి విషయం నిజమని, అక్కడి పరిస్థితులను నేను కళ్లారా చూశానని కచ్చితంగా చెప్పగలను" అని ఆయన వివరించారు. ల్యారీ ప్రాంతం ఎలా నేరగాళ్లకు అడ్డాగా మారిందో సినిమాలో వాస్తవికంగా చిత్రీకరించారని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తన కుటుంబ నేపథ్యం గురించి కూడా అజాకియా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు భారతదేశంలోని గుజరాత్‌లో గల జునాగఢ్‌లో జన్మించారని తెలిపారు. "ఈ కారణంగా నన్ను నేను పాకిస్థానీగా భావించుకోను. నేను భారతీయ మూలాలున్న వాడిని" అని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు పాకిస్థాన్‌లోని కొందరు ఈ సినిమాపై విరుచుకుపడుతుంటే, అదే దేశానికి చెందిన, ఆ ప్రాంతంలోనే ఉన్నత పదవిలో పనిచేసిన వ్యక్తి స్వయంగా చిత్రంలోని వాస్తవికతను ధ్రువీకరించడం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. సినిమాపై వస్తున్న ఆరోపణలకు ఆరిఫ్ అజాకియా వ్యాఖ్యలు బలమైన సమాధానంగా నిలుస్తున్నాయి.

## మరో టీఎంసీ ఎంపీపై దాడి!

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలపై దాడులు కలకలం రేపుతున్నాయి. పార్టీలో కీలక నేత అభిషేక్ బెనర్జీపై దాడి జరిగిన మరుసటి రోజే, ఈ ఉదయం మరో ఎంపీ సొంత నియోజకవర్గంలోనే దాడికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కల్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తల పట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడికి ముందు కొందరు వ్యక్తులు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ 'చోర్ చోర్' (దొంగ దొంగ) అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఆయన పర్యటనలోనూ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవగా.. 'చోర్ చోర్' అంటూ నినాదాలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక టీఎంసీ నేతలపై ఒకే తరహాలో దాడులు, నిరసనలు జరగడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## బంగ్లా ఖాళీ చేయను

పాట్నా: బీహార్‌లో ప్రభుత్వ బంగ్లా వివాదం మరోసారి తీవ్ర రూపం దాల్చింది. మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత రబ్రీదేవి ఉంటున్న అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, ఆమె అందుకు ససేమిరా అంటున్నారు. దమ్ముంటే తనను బలవంతంగా ఖాళీ చేయించాలని ప్రభుత్వానికి ఆమె సవాల్ విసిరారు. ఈ పరిణామంతో ఎన్డీఏ ప్రభుత్వానికి, ఆర్జేడీకి మధ్య మాటల యుద్ధం ముదిరింది. వివరాల్లోకి వెళితే.. పాట్నాలోని 10, సర్క్యులర్ రోడ్ బంగ్లాలో రబ్రీదేవి దశాబ్దానికి పైగా నివసిస్తున్నారు. అయితే, ఈ నెల 27న భవన నిర్మాణ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ బంగ్లాను పాడి, మత్స్యశాఖ మంత్రి నంద్ కిశోర్ రామ్‌కు కేటాయించారు. ఈ ఉత్తర్వులు వచ్చినప్పుడు సెలవుపై ఉన్న రబ్రీదేవి, తిరిగి పాట్నా విమానాశ్రయానికి చేరుకోగానే ఈ విషయంపై మీడియా ప్రశ్నించడంతో తీవ్రంగా స్పందించారు. "సమ్రాట్ చౌదరి ముఖ్యమంత్రి అయినందుకు చాలా ఉత్సాహంగా ఉ న్నట్టున్నారు. దమ్ముంటే వాళ్ల ప్రభుత్వమే నన్ను బలవంతంగా ఖాళీ చేయించాలి. నేను మాత్రం ఇల్లు ఖాళీ చేయను" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఆమెకు ఈ బంగ్లాను కేటాయించింది. అయితే, ఇప్పుడు ఖాళీ చేయాలని కోరడం రాజకీయ కక్ష సాధింపేనని ఆర్జేడీ ఆరోపిస్తోంది. ఈ వివాదంపై భవన నిర్మాణ శాఖ మంత్రి లేషి సింగ్ స్పందిస్తూ, శాసనమండలి ప్రతిపక్ష నేతగా రబ్రీదేవికి 39, హార్డింగ్ రోడ్ బంగ్లాను ఇదివరకే కేటాయించామని, ఆమె అక్కడికి మారితే మంచిదని సూచించారు. ప్రభుత్వ బంగ్లాలను ఎవరికి కేటాయించాలనేది ప్రభుత్వ విశేషాధికారమని, ఎవరూ ఒకే బంగ్లాపై హక్కును క్లెయిమ్ చేయలేరని ఆమె స్పష్టం చేశారు. నిజానికి గత ఏడాది నవంబర్‌లోనే ఈ బంగ్లాను ఖాళీ చేయాలని ప్రభుత్వం రబ్రీదేవిని కోరింది. అప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్న విజయ్ కుమార్ సిన్హాకు దీనిని కేటాయించినా, ఆమె ఖాళీ చేయకపోవడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

# నేపాల్-భారత్ వివాదంలోకి చైనా?



ఖాట్మండు: నేపాల్ ప్రధాని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో ఉన్న దీర్ఘకాలిక సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడంలో చైనా, బ్రిటన్ దేశాలు జోక్యం చేసుకోవాలని కోరారు. నేపాల్ పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ విధంగా మాట్లాడారు. ఇటీవలే నేపాల్ ప్రధానిగా ఎన్నికైనా బాలేంద్ర షా ఆదివారం నేపాల్ పార్లమెంటులో మాట్లాడుతూ "కేవలం భారత్ మాత్రమే నేపాల్ భూభాగాలను ఆక్రమించలేదు. నేపాల్ కూడా భారత్‌కు చెందిన పలు ప్రాంతాలను ఆక్రమించింది. ఈ అంశంపై ఇరు దేశాలు దీనిపై చర్చించుకోవాలి." అని అన్నారు.ఈ సరిహద్దు వివాదం 'బ్రిటిష్ ఇండియా' కాలం నాటిదని, అందుకే ఈ సమస్య పరిష్కారంలో ఇంగ్లాండ్ (బ్రిటన్) కూడా పాలుపంచుకోవాలని నేపాల్ భావిస్తోందని షా పేర్కొన్నారు. లింపియాధురా, లిపులేఖ్, కాలాపానీ ప్రాంతాలపై నేపాల్ హక్కులు కోరుతోంది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత, జూన్ మొదటి వారం నుండి లిపులేఖ్ కనుమ ద్వారా భారత్-చైనాలు సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించబోతున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ దౌత్యపరమైన నోట్ పంపింది.అయితే దీనిపై చరిత్రకారులు, సర్వేయర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకుందామని భారత్ ప్రత్యుత్తరం ఇచ్చినట్లు నేపాల్ ప్రధాని పేర్కొన్నారు. నేపాల్ చేస్తున్న భూభాగాల వాదనలకు ఎటువంటి చారిత్రక ఆధారాలు లేవని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఏకపక్షంగా సరిహద్దులను పెంచుకుంటూ పోవడం చెల్లదని, అయితే ఈ సమస్యను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

## గూగుల్ 3 కోట్ల దోమల జన్యుమార్పిడి

న్యూఢిల్లీ: వ్యాధులు వ్యాప్తి చేసే దోమల జనాభాను నియంత్రించేందుకు టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఒక వినూత్న ప్రయోగానికి సిద్ధమైంది. కాలిఫోర్నియా, ఫ్లోరిడా రాష్ట్రాల్లో రాబోయే రెండేళ్లలో సుమారు 3.2 కోట్ల ప్రత్యేక దోమలను విడుదల చేసేందుకు అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఈపీఏ) అనుమతి కోరింది. రసాయన పురుగుమందులపై ఆధారపడకుండా దోమల వ్యాప్తిని అరికట్టడమే ఈ ప్రయోగం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆల్ఫాబెట్‌కు చెందిన 'వెరిలీ' విభాగం 'డీబగ్' అనే ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా, 'వొల్బాకియా' అనే సహజ సిద్ధమైన బ్యాక్టీరియాతో నింపిన మగ దోమలను వాతావరణంలోకి విడుదల చేస్తారు. ఈ మగ దోమలు అడవి ఆడ దోమలతో కలిసినప్పుడు, వాటి నుంచి వెలువడే గుడ్లు పొదగవు. ఫలితంగా, దోమల జనాభా క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ఇది జన్యు మార్పిడి కాదని, కేవలం సహజ పద్ధతి అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వెస్ట్ నైల్ వైరస్, డెంగ్యూ, జికా వంటి ప్రమాదకరమైన వ్యాధులను వ్యాప్తి చేసే క్యూలెక్స్ జాతి దోమలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రయోగం చేస్తున్నారు. గతంలో కాలిఫోర్నియాలోని ఫ్రెస్నో నగరంలో ఈ పద్ధతి ద్వారా దోమల సంఖ్యను 95 శాతం తగ్గించగలిగారు. సింగపూర్‌లో ఇదే విధానంతో డెంగ్యూ కేసులను 70-77 శాతం వరకు నియంత్రించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఈపీఏ సమీక్షలో ఉంది. దీనిపై ప్రజల అభిప్రాయాలను జూన్ 5 వరకు స్వీకరిస్తారు. ఈ ప్రయోగం వల్ల పర్యావరణ సమతుల్యతపై ఎలాంటి ప్రభావం ఉ ంటుందనే దానిపై కూడా అధ్యయనం చేశాకే ఈపీఏ తుది నిర్ణయం తీసుకోనుంది.

## ముంబైలో ఎయిరిండియా కాలనీలు క్లోజ్!

ముంబై: దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా పుట్టిన నగరంలో ఆ సంస్థకు చెందిన చివరి ఆనవాళ్లు కూడా కనుమరుగవుతున్నాయి. ముంబైలోని శాంతాక్రూజ్ ఈస్ట్, కలినాలో ఉన్న చారిత్రక ఎయిర్ ఇండియా ఉద్యోగుల కాలనీల 7 దశాబ్దాల శకం మే 31తో ముగిసింది. సుదీర్ఘ పోరాటం తర్వాత, చివరి నివాసితులు కూడా ఈ కాలనీలను వీడి వెళ్లడంతో, ఒక అధ్యాయం ముగిసినట్లయింది. ఈ కాలనీల ఖాళీ ప్రక్రియ ఎయిర్ ఇండియా ప్రస్థానంలో ఒక భావోద్వేగ ఘట్టంగా నిలిచిపోయింది. 1955లో నిర్మించిన ఈ కాలనీలు దాదాపు 184 ఎకరాల విస్తీర్ణంలో ఉ న్నాయి. మొత్తం నాలుగు కాలనీలలో 106 భవనాల్లో 1,683 ఫ్లాట్లు ఉండేవి. ఒకప్పుడు వేలాది కుటుంబాలతో కళకళలాడిన ఈ ప్రాంగణంలో, చివరిగా మిగిలిన సుమారు 150 కుటుంబాలు నేడు తమ ఇళ్లను ఖాళీ చేశాయి. వీరిలో ఎక్కువ మంది ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ఉద్యోగులే. రెండు దశాబ్దాల క్రితం ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ (వీఖూూూ)కు లీజుకు ఇచ్చిన ఈ భూమిని ఇప్పుడు పూర్తిగా వారికి అప్పగించనున్నారు. 2022లో ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ జరిగిన తర్వాత, యాజమాన్యం ఈ కాలనీలను ఖాళీ చేయమని ఆదేశించింది. అయితే, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లు తమ సర్వీస్ కండిషన్‌లో భాగమని పేర్కొంటూ ఉద్యోగులు సుదీర్ఘ న్యాయపోరాటం చేశారు.



## అంజన్న సేవలో పెద్దపల్లి కలెక్టర్

మల్యాల,మే 31 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కుటుంబ సమేతంగా ఆద్షివరం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేదోక్త ఆశీర్వచనాలతో కలెక్టర్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించి, శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ ,ఏ ఎస్సై చిలుక శ్రీనివాస్ ,ఆర్ ఐ తిరుపతి ఉన్నారు.



## గిన్నిస్ బుక్‌లోకి అంబటి రీమ, రియాతేజ

హైదరాబాద్, మే 29: హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన 'గిన్నిస్ అచీవర్స్ మీట్' కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించిన భారీ కీబోర్డ్ సంగీత కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన 2,000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు నిరంతరాయంగా కీబోర్డ్ వాయిస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన 777 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. వారికి హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండింగి గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వయంగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గ్రామానికి చెందిన అంబటి రవీంద్రబాబు, పరిమళ దంపతుల కుమార్తెలు అంబటి రీమ, అంబటి రియాతేజ పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. రీమ ప్రస్తుతం తత్వ అకాడమీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, రియాతేజ వరసిగూడలోని కాకతీయ హై స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన రీమ, రియాతేజలను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు అభినందించారు.

# కొండగట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పదవీవిరమణ



మల్యాల, మే 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులుగా సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన శ్రీ వకుళాభరణం రఘు గారు నేడు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకులు వేదోక్త మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను సమర్పించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈఓ అంజనారెడ్డి మాట్లాడుతూ, వకుళాభరణం రఘు గారు తమ జీవితాన్ని స్వామివారి సేవకు అంకితం చేసి, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించడంతో పాటు వేద సంప్రదాయాల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధి, ఆగమ శాస్త్ర పరిరక్షణ, భక్తులకు సక్రమమైన పూజా సేవలు అందించడంలో వారి పాత్ర ఎనలేనిదని అన్నారు. "సేవే పరమో ధర్మః" అనే స్ఫూర్తితో ఆయన అందించిన సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని, ఆయన అంకితభావం, నిబద్ధత, వినయపూర్వక సేవా దృక్పథం భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. శ్రీ ఆంజనేయస్వామి వారి కృపాకటాక్షాలతో రఘు గారు ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కూడిన ప్రశాంతమైన పదవీ విరమణ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అర్చక విభాగం తరపున ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, చిన్నరాము గారు వస్త్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. సహచర అర్చకులు, ఆలయ సిబ్బంది రఘు గారి సేవలను స్మరించుకుంటూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ) హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్,చెక్కిళ్ళ అశోక్ , ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతి ప్రసాద్, చిన్నరాము, ముఖ్య అర్చకులు లక్షణ ప్రసాద్, అభిలాష్ తదితరులు పాల్గొని రఘు గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కొండగట్టు దేవస్థానంలో ఎన్నో సంవత్సరాల పాటు భక్తి, శ్రద్ధ, క్రమశిక్షణతో సేవలందించిన వకుళాభరణం రఘు గారి పదవీ విరమణ సందర్భంగా ఆలయ వర్గాలు, భక్తులు ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సేవా ప్రస్థానం దేవస్థాన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## దుర్గ గుడికి వెళ్లే భక్తులకు అలర్ట్



విజయవాడ, మే 31 (ఈవార్తలు): దుర్గ గుడికి వచ్చే భక్తులకు దేవస్థానం కీలక విజ్ఞప్తి చేసింది. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోకి మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని కోరింది. భక్తులు దర్శనాలకు వచ్చే సమయంలో తమ వెంట సెల్‌ఫోన్లు తీసుకు రావొద్దని దుర్గ గుడి ఈవో శీనానాయక్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో విచ్చలవిడిగా సెల్ ఫోన్లు వాడుతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ అంశంపై శనివారం పాలకమండలి సమావేశంలో చర్చించారు. ఆలయ ప్రాంగణంలో సెల్ ఫోన్ల ఉపయోగాన్ని అరికట్టాలని నిర్ణయించిన దుర్గ గుడి దేవస్థానం.. ఇందులో భాగంగా కొండపైకి సెల్ ఫోన్లు తీసుకుని రావొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగులు, సెక్యూరిటీ, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు ఎవరూ కూడా అదివారం నుంచి కొండ మీదకు సెల్ ఫోన్లు వినియోగించకూడదని స్పష్టం చేసింది. ఆలయం లోపల విధులు నిర్వహించేటప్పుడు కూడా సెల్ ఫోన్లు కలిగి ఉన్నా, వినియోగించినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. అత్యవసర సమాచారం అందించేందుకు మాత్రమే సెల్ ఫోన్లకు అనుమతిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. దేవస్థానం ఉద్యోగులు, సూపరింటెండెంట్‌లు, కౌంటర్ సిబ్బంది. గుమాస్తాలు అందరికీ ఈ రూల్ వర్తిస్తుందని దుర్గ గుడి దేవస్థానం స్పష్టం చేసింది. అయితే శానిటేషన్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీలకు మాత్రం అవసరమైన సమయంలో సెల్ ఫోన్లు ఉపయోగించేందుకు అనుమతి ఉంటుందని తెలిపింది. దేవస్థానం లోపల, వెలుపల ప్రాంగణం, స్కానింగ్ పాయింట్లు, రాజగోపురాలు వద్ద సెల్ ఫోన్లు పూర్తిగా అనుమతించమని స్పష్టం చేసింది. మరోవైపు ఆదివారం నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. ఆలయ ఈవో, అధికారులు టికెట్ స్కానింగ్ పాయింట్ల వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కొంతమంది భక్తులు మొబైల్ ఫోన్లతో దర్శనాలకు వెళ్తున్న సంగతి గుర్తించి.. వారిని వెనక్కి పంపించారు. ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని, సెల్ ఫోన్లకు ఆలయంలోకి అనుమతి లేదని భక్తులకు వివరించారు. మరోవైపు గర్భాలయంతో పాటుగా రాజగోపురం, క్యూలైన్లు, అమ్మవారి ఉత్సవ మూర్తులు ఉన్న ప్రదేశాలలో చాలామంది మొబైల్ ఫోన్లు విచ్చలవిడిగా వినియోగిస్తూ ఫోటోలు తీస్తున్నారు. అలాగే రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయం ఆలయ దేవస్థానం దృష్టికి చేరటంతో ఈ నిర్ణయం తీసుకుంది.

## గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులు

మల్యాల, మే 31 (ఈవార్తలు): ఆదివారం సెలవు దినం, గిరి ప్రదక్షణ పురస్కరించుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 25 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేశ సేవకు పొన్నం అజయ్

**డిగ్రీ ఫస్టియర్‌లోనే ఆర్మీ ఉద్యోగం**



మల్యాల, మే 31 (ఈవార్తలు): డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూనే భారత సైన్యం (ఆర్మీ)లో ఉద్యోగం సాధించి మల్యాల ప్రాంతానికి చెందిన యువకుడు పొన్నం అజయ్ ప్రతిభ చాటాడు. చిన్నప్పటి నుంచే ఆర్మీలో చేరాలనే లక్ష్యంతో కృషి చేసిన అజయ్, మొదటి ప్రయత్నంలోనే పరీక్షలు, శారీరక దారుఢ్య పరీక్షలు (ఈవెంట్లు) విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగాన్ని పొందాడు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ, తన విజయానికి తల్లిదండ్రులు పొన్నం రవి, నీలవ్వతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని తెలిపారు. కష్టపడి శ్రమించి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. చిన్ననాటి కలను మొదటి ప్రయత్నంలోనే నెరవేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అలాగే మలయాల ప్రాంతంలోని గౌడ్స్ సమాజం నుంచి ఆర్మీ ఉద్యోగం సాధించిన తొలి వ్యక్తిగా నిలవడం తనకు గర్వకారణమని చెప్పారు. తన విజయం యువతకు, సోదరులకు, స్నేహితులకు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర కృషితో ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అజయ్ యువతకు సూచించారు.

## లోకేశ్ స్టాన్‌ఫర్డ్ సర్టిఫికెట్ కొన్నాడు: లక్ష్మీపార్వతి

తాడేపల్లి, మే 31 (ఈవార్తలు): బ్రిటిష్ కాలం నాటి విధానాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. బ్రిటిషర్లపై పోరాడినట్లే ఇప్పుడు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మోసానికి రెండేళ్లు పేరుతో వైఎస్సార్‌సీపీ మహిళా నేతల సమావేశం జరిగింది. ఇందులో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. "చంద్రబాబు నాయుడు మొదట ఇందిరా గాంధీకి వెన్నుపోటు పొడిచాడు. చంద్రబాబు మాటలు నమ్మి ఎన్నికలకు వెళ్లినందుకు కాంగ్రెస్ దారుణంగా ఓడిపోయింది. కాంగ్రెస్ ఓడిపోగానే చంద్రబాబు ఎన్టీఆర్ కాళ్లదగ్గర చేరాడు. చంద్రబాబును పార్టీలోకి తీసుకోవద్దని అందరూ వ్యతిరేకించారు. లోకేశ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదవలేదు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో సర్టిఫికెట్ కొన్నారు. లోకేశ్ సెవెన్త్ క్లాస్ కూడా సరిగ[illegible]గా పాసవ్వలేదు. ఇలాంటి అసమర్థుడిని చంద్రబాబు ప్రజలపై రుద్దాలని చూస్తున్నాడు. మహిళల క్యారెక్టర్ ను కించపరచడమేనా చంద్రబాబు మహిళలకు చేసే మేలు. బాలకృష్ణ ఈ రోజు చక్కగా సినిమాలు చేసుకుంటున్నాడంటే వైఎస్సార్ పెట్టిన భిక్ష. జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చూడాలంటే మహిళల పైనే ఎక్కువ బాధ్యత ఉంది. కానీ భార్యను అడ్డంపెట్టుకుని చంద్రబాబు ఎన్టీఆర్ ను బుట్టలో వేసుకున్నాడు. చంద్రబాబుకు ఎడారి ఒంటె కథ సరిగ్గా సరిపోతుంది. టెంటు కింద చోటిస్తే యజమానిని బయటకు తోసేసిన ఒంటె, చంద్రబాబు ఒకే రకం. చంద్రబాబు అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకుంటాడు. ఎన్టీఆర్ తో నా పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్టీఆర్ పార్టీ నుంచి బయటికి పొమ్మంటే నన్ను బతిమిలాడుకున్నాడు. నేను పట్టుబట్టడం వల్లే చంద్రబాబును పార్టీ నుంచి బయటికి గెంటేయకుండా ఆగారు. ఆ రోజు ఎన్టీఆర్ కు ద్రోహం చేయొద్దని నేను కోరాను. ఎన్టీఆర్ ను ఎప్పటికీ మోసం చేయనని నా చేతిలో చేయి వేసి, తన కొడుకుపై చంద్రబాబు ఒట్టు వేశాడు. నా దగ్గర ఒట్టు వేసి ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచారు. చంద్రబాబు చేయి తాకడం కూడా పాపమే. వైస్రాయ్ హోటల్ కు వెళ్లినందుకు ఎన్టీఆర్ పై చెప్పులు వేయించారు. అవమానిస్తే ఎన్టీఆర్ చనిపోతాడని తెలిసి తీవ్రంగా అవమానించారు. ఎన్టీఆర్ పై క్షుద్రపూజలు కూడా చేయించిన నీచుడు చంద్రబాబు" అని చెప్పారు.

## జెన్‌జీ కోసం సేనా గళం



మంగళగిరి, మే 31 (ఈవార్తలు): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సేనా గళం పేరుతో కమిటీ ఏర్పాటు చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ముఖ్యనేతలతో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా.. జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. సమకాలీన రాజకీయాల్లో రాజ్యాంగానికి కట్టుబడి, అన్ని వర్గాలకు గౌరవం ఇస్తూ, దేశ సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరించేలా సేనా గళం కమిటీ పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. ముల్లును ముల్లుతోనే తీయాలి.. కాపులు తిడితే కాపులతోనే తిట్టించాలి. రెడ్లు , కమ్మవారు విమర్శిస్తే ఆ సామాజిక వర్గాలతోనే ప్రతి విమర్శ చేయించాలనే బూర్జువా ధోరణిని పక్కనపెట్టి సేనా గళం కమిటీ పనిచేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. జనసేన అభ్యుదయ భావాలతో ముందుకెళ్లాలని.. పాతబడి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలు ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీగా సామాజిక బాధ్యతతో జనసేన పార్టీ ముందుకు వెళ్తూ సేనా గళం ఏర్పాటు చేసినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. మరోవైపు రాజకీయాల్లో కొంతమంది కావాలనే వారి తప్పులను వ్యక్తిగతంగా కాకుండా కులం, మతం, వర్గాలతో ముడిపెట్టి సామాజిక విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పవన్ కళ్యాణ్ విమర్శించారు. ఇది సమాజంలో విద్వేషాలకు కారణమవుతోందని అభిప్రాయపడ్డారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కొందరు కులం, మతం, ప్రాంతీయత వంటి భావావేశాల ముసుగు వేసుకుని దాక్కొనే ప్రయత్నం చేస్తున్నారనీ.. ఇటువంటి రాజకీయ సంస్కృతిని నేటి యువత తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్న వాస్తవాన్ని వారు గుర్తించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలన్న పవన్ కళ్యాణ్.. సామాజిక వర్గాలను ఆ వ్యవహారంలోకి లాగకూడదనే స్పష్టమైన విధానాన్ని జనసేన పార్టీ అవలంబిస్తోందని స్పష్టం చేశారు.

## బెదిరింపులకు భయపడం

**విడదల రజని**

తాడేపల్లి, మే 31 (ఈవార్తలు): కేసులకు, బెదిరింపులకు తాను బెదిరిపోనని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'చంద్రబాబు మోసానికి' రెండేళ్లు పేరిట పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మహానాడు సాక్షిగా అబద్ధాలు,మహిళలకు చేసిన మోసంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా విడదల రజిని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే వేధింపులు.. సూపర్ సిక్స్ హామీని గాలికొదిలేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజీని అమ్మకానికి పెట్టారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని ఆటకెక్కించారు. చంద్రబాబు మోసాలు,అన్యాయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం. బాబును భూస్థాపితం చేయడం మహిళలకే సాధ్యం'అని అన్నారు.

## తెలుగమ్మాయికి ప్రతిష్ఠాత్మక అవార్డు

పల్నాడు జిల్లా, మే 31 (ఈవార్తలు): అమెరికాలో మరో తెలుగు తేజం తన ప్రతిభతో మెరిసింది. పల్నాడు జిల్లాకు చెందిన అనన్య గోలి అనే విద్యార్థిని టెక్నాలజీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచి అరుదైన గౌరవాన్ని అందుకుంది. మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్ ఏటా అందించే 'మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్' అవార్డుల్లో భాగంగా అనన్య 'స్టేట్ ఆనరబుల్ మెన్షన్' పురస్కారానికి ఎంపికైంది. హైస్కూల్ విద్యార్థుల్లో కంప్యూటింగ్, టెక్నాలజీ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ వంటి అంశాల్లో చూపిన ప్రతిభకు ఈ అవార్డును అందిస్తారు. ముఖ్యంగా టెక్ రంగంలో బాలికలను, ఇతర వర్గాల వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ ఏడాది ఈ గౌరవానికి ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థుల్లో అనన్య ఒకరిగా నిలవడం విశేషం. అనన్య తల్లిదండ్రులు గోలి కృష్ణ చైతన్య, సంప సిన్హా. వీరి స్వస్థలం పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి. సాఫ్ట్‌వేర్ నిపుణులైన వీరు 2014లో అమెరికాలో స్థిరపడ్డారు. అనన్య ప్రస్తుతం మిన్నెసోటాలోని ఈడెన్ ప్రైరీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. నేషనల్ సెంటర్ ఫర్ విమెన్ ఉ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనుబంధ సంస్థ అయిన మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్ ఈ అవార్డులను నిర్వహిస్తోంది. చిన్న వయసులోనే టెక్నాలజీలో తెలుగు బాలిక గుర్తింపు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

లహరి చిత్రం



నియతి ఫతర్నానీ

# మూడు పాత్రల్లో అల్లు అర్జున్

'పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది.






# పెద్ది సినిమాను వదిలేద్దామనుకున్నా: శివరాజ్ కుమార్

కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ తన క్యాన్సర్ పోరాటం గురించి రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ కోసం చెన్నై వెళ్లిన ఆయన తనకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవాలని అనుకున్నట్లు వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనకు కథ చెప్పిన రోజునే తాను రామ్ చరణ్‌తో కూడా మాట్లాడానని, అయితే ఆ తర్వాత 2024లో తనకు క్యాన్సర్ ఉన్నట్లు తేలిందని ఆయన గుర్తుచేసుకున్నారు. వైద్యం కోసం అమెరికా వెళ్లాల్సి రావడంతో సినిమాను క్యాన్సిల్ చేద్దామా అని మేకర్స్‌ను అడిగానని, కానీ దర్శకుడు బుచ్చిబాబు మరియు చిత్రబృందం తన స్థానంలో మరొకరిని రీప్లేస్ చేయడానికి అస్సలు ఒప్పుకోలేదని శివరాజ్‌కుమార్ తెలిపారు. తన కోసమే సినిమాను ఆపి, చాలా కాలం పాటు ఎదురుచూశారని, వారి చూపిన ప్రేమకు తాను ఎల్లప్పుడూ కృతజ్ఞతుడనై ఉంటానని ఈ 64 ఏళ్ల నటుడు ఎమోషనల్ అయ్యారు. ఈ ఈవెంట్‌లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సైతం శివరాజ్‌కుమార్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాలో శివరాజ్‌కుమార్ చేసిన గెస్ట్ అప్పీయరెన్స్ కోసమే తాను ఈ చిత్రాన్ని పలుమార్లు చూశానని చరణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా కారులో సిగరెట్ కాలుస్తూ వచ్చే స్లో-మోషన్ షాట్ ఒక ఐకానిక్ పర్ఫార్మెన్స్ అని, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ తెరపై ఒక నిప్పుకణంలా ఉంటుందని, ఆయన కళ్లే ఎన్నో భావాలను పలికిస్తాయని కొనియాడారు.



## శోభితతో అందమైన క్షణాలు: నాగచైతన్య

నటుడు నాగచైతన్య తన భార్య శోభితా ధూళిపాళ్ల 34వ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. ఆదివారం నాడు ఆయన షేర్ చేసిన ఈ పోస్ట్‌లో వీరిద్దరి ప్రయాణానికి సంబంధించిన కొన్ని అందమైన క్షణాలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వారు కలిసి వెళ్లిన ట్రెకింగ్ ఎస్కేప్‌లు, క్యాజువల్ డేట్ నైట్స్, సరదాగా గడిపిన క్షణాలకు సంబంధించిన ఫోటోలను చైతన్య ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ ఫోటోలతో పాటు, పుట్టినరోజు శుభాకాంక్షలు నా లేడీ శోభితా.. నీతో కలిసి ఈ జీవిత ప్రయాణాన్ని సాగిస్తున్నందుకు చాలా కృతజ్ఞతగా ఉంది అంటూ ఒక అందమైన నోట్‌ను కూడా జతచేశారు.

## ప్రియాంకనే ప్రపోజ్ చేసింది: శివకుమార్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. 'మౌనరాగం' సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది. వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. "పెళ్లి ఎప్పుడు?" అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.



# నాన్నే నా హీరో

తెలుగు సినీ పరిశ్రమలో తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ -- మహేశ్‌బాబు బంధం మరోసారి అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. లెజెండరీ నటుడు కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. తండ్రి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మహేశ్ చేసిన ఈ పోస్టుకు అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. మే 31న కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. చిన్న వాక్యమే అయినప్పటికీ, తండ్రిపై తనకున్న ప్రేమ, గౌరవం, అనుబంధాన్ని ఎంతో హృదయపూర్వకంగా వ్యక్తం చేశారు. కృష్ణ భౌతికంగా దూరమైనా, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ తనతోనే ఉంటాయనే భావన ఈ పోస్టులో స్పష్టంగా కనిపించింది. మహేశ్‌బాబు సినీ ప్రయాణానికి బలమైన పునాది వేసింది కూడా కృష్ణే. బాలనటుడిగా మహేశ్‌ను వెండితెరకు పరిచయం చేసిన కృష్ణ, ఆ తర్వాత ఆయనను స్టార్ హీరోగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. చిన్నప్పటి నుంచే కుమారుడిలోని నటన ప్రతిభను గుర్తించిన కృష్ణ, కెరీర్ ప్రారంభంలో ప్రతి అడుగులోనూ మార్గదర్శకుడిగా నిలిచారు. కృష్ణ, మహేశ్‌బాబు కలిసి దాదాపు 11 చిత్రాల్లో నటించారు. వీరిద్దరూ కలిసి తెరపై కనిపించిన ప్రతి సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'పోరాటం' చిత్రం మహేశ్‌బాబు తన తండ్రితో కలిసి నటించిన తొలి చిత్రం కావడం విశేషం. ఆ తర్వాత కూడా పలు చిత్రాల్లో తండ్రీకొడుకులు కలిసి నటించి అభిమానులను అలరించారు. మహేశ్‌బాబు తన కెరీర్‌లో ఎన్నో సందర్భాల్లో తండ్రి గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

## జయం రవి.. ఎల్‌సీయూ ఎంట్రీ

స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ సృష్టించిన క్రేజీ ఫ్రాంచైజీ 'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్' లోకి మరో ప్రముఖ నటుడు అధికారికంగా అడుగుపెట్టారు. రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బెంజ్' చిత్రంలోకి తమిళ నటుడు రవి మోహన్ (జయం రవి) చేరారు. ఈ విషయాన్ని డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ చిత్ర సెట్స్ నుండి కొన్ని ఫోటోలను పంచుకున్నారు. వెల్‌కమ్ టు ది యూనివర్స్ రవి మోహన్ సార్ అంటూ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. భాగ్యరాజ్ కణ్ణన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామాను లోకేశ్ కనగరాజ్ తన సొంత బ్యానర్ 'జీ స్క్వాడ్' పై ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ సంస్థలతో కలిసి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి లోకేశ్ కనగరాజ్ స్వయంగా కథను అందించడం విశేషం. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' చిత్రాల తర్వాత లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న నాల్గవ చిత్రంగా 'బెంజ్' నిలవనుంది. అయితే లోకేశ్ దర్శకత్వం వహించకుండా కేవలం కథ అందించి నిర్మిస్తున్న మొదటి ఎల్‌సీయూ చిత్రం ఇదే కావడం గమనార్హం. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ 'ట్విన్ ఫిష్ వాల్టర్' అనే అత్యంత శక్తివంతమైన క్రూరమైన విలన్ పాత్రలో నటిస్తుండగా, సంయుక్త మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రవి మోహన్ ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఎల్‌సీయూ లవర్స్‌కు సరికొత్త యాక్షన్ అనుభూతిని పంచనుంది.



# హన్సిక వెరీ ఎమోషనల్



సినీ పరిశ్రమలో సెలబ్రిటీల విడాకులు తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. ప్రేమగా మొదలైన బంధాలు అనుకోని కారణాలతో ముగిసిపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంటుంది. తాజాగా నటి హన్సిక తన వైవాహిక జీవితానికి ముగింపు పలికిన అనంతరం మొదటిసారి ఈ అంశంపై బహిరంగంగా స్పందించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త సోహైల్ ఖతూరియాతో విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హన్సిక తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న భావోద్వేగ పరిస్థితులను వివరించారు. జీవితంలో కొన్ని నిర్ణయాలు కఠినంగా అనిపించినప్పటికీ, అవి మన మంచికే అయితే వాటిని ఆలస్యం చేయకుండా తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నిర్ణయం తప్పు అని అనిపిస్తే దాన్ని సరిదిద్దుకోవడానికి వెనుకాడకూడదు. గత రెండేళ్లుగా నా మానసిక పరిస్థితి చాలా ప్రభావితమైంది. సాధారణంగా నేను చాలా ఉల్లాసంగా, ఆనందంగా ఉండే వ్యక్తిని. కానీ ఆ సమయంలో పూర్తిగా నిశ్శబ్దంగా, బాధతో ఉండేదాన్ని. నా పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు కూడా చాలా ఆందోళన చెందారు అని హన్సిక తెలిపారు. తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఒక స్నేహితురాలు అండగా నిలిచిందని ఆమె చెప్పారు. నా పరిస్థితిని గమనించిన ఓ స్నేహితురాలు డాక్టర్‌ను సంప్రదించి నాకు థెరపీ అవసరమని సూచించింది. ఆ తర్వాత నేను కౌన్సెలింగ్ తీసుకున్నాను. ఆ ప్రక్రియ నాకు ఎంతో సహాయపడింది.





# కోహ్లీ దగ్గరుండి..!

## ఆర్సీబీదే కప్.. వరుసగా రెండోసారి విన్.. ఫైనల్లో చిత్తైన గుజరాత్

ఐపీఎల్ 2026 చాంపియన్‌గా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చేజింగ్ మాస్టర్‌గా పేరు పొందిన విరాట్ కోహ్లీ ఆఖరి దాకా నిలిచి ఆర్సీబీని గెలిపించాడు. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

**విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 75 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32), టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 24 పరుగులు) ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2 వికెట్లు తీయగా, మహ్మద్ సిరాజ్, రబాడ, అర్షద్ ఖాన్ తలా వికెట్ తీశారు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్), నిషాంత్ సింధూ (20 పరుగులు) ఆడుతున్నారు. రసిక్ సలామ్ 3 వికెట్లు తీయగా, హాజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ చెరో 2 వికెట్లు తీశాడు.**




ఐపీఎల్‌లో 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఛాంపియన్‌గా అవతరించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ నిలబెట్టుకుంది. 19వ సీజన్‌లో ఛాంపియన్ ఆటతో ఫైనల్ చేరిన ఆర్సీబీ అదిరే ఆటతో గుజరాత్ టైటాన్స్ ఆశలపై నీళ్లు చల్లింది. క్వాలిఫయర్ 1లో చిత్తైన గుజరాత్‌ను భువనేశ్వర్(2-29), రసిక్ దారల్ సలాం(3-27)లు 155కే పరిమితం చేయగా.. ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ(75 నాటౌట్) ఖతర్నాక్ అర్ధ శతకంతో బెంగళూరును గెలిపించాడు. బ్యాటర్ల వైఫల్యంతో మ్యాచ్‌లో వెనబడిన శుభ్‌మన్ గిల్ సేన రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఐపీఎల్ 19లో ఆర్సీబీ ఛాంపియన్ ఆటతో విజేతగా నిలిచింది. క్వాలిఫయర్ 1లో గుజరాత్ టైటాన్స్‌ను అలవోకగా ఓడించిన ఆర్సీబీ ఫైనల్లోనూ టాప్ గేర్‌లో ఆడి రెండోసారి ట్రోఫీని ముద్దాడింది. తొలుత గుజరాత్‌ను 155కే కట్టడి చేసిన ఆర్సీబీ లక్ష్యం వైపు వడివడిగా అడుగులేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లువెంకటేశ్ అయ్యర్(32), విరాట్ కోహ్లీ(75 నాటౌట్) శుభారంభమిచ్చారు. రబడ ఓవర్లో 4, 6, 4, 4 బాదిన అయ్యర్ ఏకంగా 18 పరుగులు పిండుకున్నాడు. సిరాజ్ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన విరాట్ అనంతరం రబడను లక్ష్యంగా చేసుకొని రెండు బౌండరీలు, సిక్సర్‌తో స్కోర్ 50 దాటించాడు. దంచేస్తున్న ఈ జోడీని సిరాజ్ విడదీసి తొలి బ్రేకిచ్చాడు. జట్టు స్కోర్ 62 వద్ద అయ్యర్ సులువుగా రబడ చేతికి దొరికాడు. ఆ తర్వాతి ఓవర్లోనే పడిక్కల్(1) గాల్లోకి లేపిన బంతిని బౌండరీ వద్ద అర్షద్ ఖాన్ ఒడుపుగా అందుకున్నాడు. ఆర్సీబీ ఎండో వికెట్ కోల్పోయింది. అదే ఓవర్లో చివరి బంతికి కోహ్లీ సిక్సర్ బాదగా ఆర్సీబీ పవర్ ప్లేలో రెండు వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. స్ట్రాటజిక్ బ్రేక్ అనంతరం రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పటిదార్(15), కృనాల్ పాండ్యా(1)ను ఔట్ చేసి గుజరాత్ శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, టిమ్ డెవిడ్(24)తో కోహ్లీ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. విజయానికి 24 పరగుల దూరంలో డేవిడ్ ఔటైనా.. జితేశ్ శర్మ(11 నాటౌట్)తో కలిసి విరాట్ లాంఛనం ముగించాడు. అర్షద్ వేసిన18వ ఓవర్లో కోహ్లీ 4, 6 బాదడంతో బెంగళూరు 5 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. క్వాలిఫయర్ 1లో తేలిపోయిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు ఫైనల్లోనూ తడబడ్డారు. అహ్మదాబాద్‌లో ఆర్సీబీ పేసర్ల ధాటికి పవర్ ప్లేలోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్(10), సాయి సుదర్శన్(12)లు పెవిలియన్ చేరగా.. మిడిలార్డర్ చేతులెత్తేసింది. వ్యూహాత్మకంగా బ్యాక్ లెంగ్త్, బౌన్సర్లతో భువనేశ్వర్(2-29), రసిక్ దార్ సలాం(3-27) గుజరాత్ హిట్టర్లను కట్టడి చేయగా.. వాషింగ్టన్ సుందర్(50 నాటౌట్) అర్ధ శతకంతో పోరాడాడు. అతడు చివరిదాకా నిలబడడంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేయగలిగింది.

## వైభవ్ ప్రత్యేకమైన క్రికెటర్: సచిన్

భారత క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటను దిగ్గజ ఆటగాళ్లు వేనోళ్ల పొగుడుతున్నారు. ఐపీఎల్ 19లో వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు చూసి అతడు నా ఫేవరెట్ క్రికెటర్ అని ప్యాట్ కమిన్స్.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లలో వైభవ్ ఒకడు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చెప్పేశారు. పదిహేనేళ్లకే దునియా మొత్తాన్ని తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలూ దక్కాయి. వైభవ్ చాలా ప్రత్యేకమని, అతడి మణికట్టు మ్యాజిక్ అద్భుతమైని సచిన్ పేర్కొన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో వంద శతకాలతో చరిత్ర సృష్టించిన సచిన్ టెండూల్కర్ ఐపీఎల్‌లో దుమ్మురేపిన వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తేశాడు. క్రిక్ఇన్ఫో 21వ శతాబ్దపు ఉత్తమ పురుష క్రికెటర్ అవార్డుకు ఎంపికైన సచిన్ మాట్లాడుతూ వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్ అని చెప్పాడు. వైభవ్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు. సహజసిద్ధంగా అతడికి అబ్బిన క్రికెట్ నైపుణ్యాలతో ఎవరూ పోటీపడలేరు. ప్రతిఒక్కరూ సూర్యవంశీ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, నేను అతడి ఆటను గమనిస్తున్నా. ఎంతో గొప్పగా ఆడుతున్నాడు. అతడు బంతిని బాదే సామర్థ్యం మాత్రమే కాదు అతడు మణికట్టును కదిలించే తీరు అద్భుతం. మైదానం నలువైపులా షాట్లు ఆడాలంటే మణికట్టును మెరుపులా కదలించడం కీలకం. వైభవ్ బంతిని బాదడం కాదు.. లైన్ అండ్ లెంగ్త్‌ను అందరికంటే ముందే పసిగడుతున్నాడు. దాంతో, అలవోకగా బంతిని స్టాండ్స్‌లోకి పంపుతున్నాడు అని వైభవ్ ఆటను విశ్లేషించిన సచిన్ అతడిని టెస్టుల్లో చూడాలని ఆశపడుతున్నట్టు చెప్పాడు. 'వైభవ్‌ను నేను టెస్టు జెర్సీలో చూడాలనుకుంటున్నా. అలా అనీ తొందరేమీ లేదు. వైభవ్‌ను అతడిలానే ఉండాలని నేను కోరుతున్నా. అయితే.. టెస్టుల్లో అతడు సవాళ్లను ఎలా అధిగమించాలో నేర్చుకుంటాడు. వైభవ్ చాలా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తాడు. టెస్టుల్లో బౌలర్లు విసిరే సవాళ్లకు అతడు ఎలా స్పందిస్తాడో చూడాలనుంది. అంతేతప్ప నేను అతడి సహజ నైపుణ్యాలను తక్కువ చేయడం లేదు. ప్రస్తుతానికి బంతిని సునిశితంగా గమనించి బాదేస్తున్న వైభవ్.. ఆ సిగ్నల్‌లో అంతరాయం ఏర్పడితే కష్టాలు తప్పవు. అప్పుడు అతడికి నిజమైన సవాళ్లు ఎదురవుతాయి. అందుకని అతడిని ఇప్పటిలానే స్వేచ్ఛగా కోరుతున్నా. కాలంలో పాటు అతడు ఆటలోని సవాళ్లను ఎలా అధిగమించాలో నేర్చుకుంటాడు. టెస్టులే కాదు ఏ ఫార్మాట్‌లో వైబవ్ గొప్పగా ఆడుతాడో అందులోనే కొనసాగించాలి.




### చరిత్ర సృష్టించిన

## సాత్విక్ - చిరాగ్

గత సీజన్ నుంచి అంతర్జాతీయ టోర్నీలో దుమ్మురేపుతున్న సాత్విక్ సాయిరాజ్(ఞఫ్షఱని ఞఖఱఅయితీఖుయ) -- చిరాగ్ శెట్టి (జప్రఱతీఖుస్త్ర ఞాప్ట్రవీఎ) ద్వయం చరిత్ర సృష్టించింది. ఏళ్లుగా భారత డబుల్స్ క్రీడాకారులను ఊరిస్తున్న సింగపూర్ ఓపెన్ ట్రోఫీని ఈ జోడీ గెలుపొందింది. ఆదివారం ఫైనల్లో టాప్ గేర్‌లో ఆడిన భారత జంట ఫైనల్లో ఫజర్ అల్ఫియాన్ -- ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ(ఇండోనేషియా)ను మట్టికరిపించి టైటిల్‌ను కొల్లగొట్టింది. తద్వారా రెండేళ్లలో రెండో ట్రోఫీని సాధించింది సాత్విక్ -- చిరాగ్ జోడీ. థామస్ కప్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకున్న సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం సింగపూర్ ఓపెన్ సూపర్ 750 పురుషుల డబుల్స్‌లో ట్రోఫీని పట్టేసింది. సెమీస్‌లో వరల్డ్ నంబర్ 1 జోడీ కిమ్ వాన్ హొ -- సియో సెయంగ్ జీ(దక్షిణ కొరియా)ని 52 నిమిషాల్లోనే ఓడించిన భారత జంట ఫైనల్లోనూ పంజా విసిరింది. ఇండోనేషియా షట్లర్లు ఫజర్ అల్ఫియాన్ -- ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ తొలి సెట్‌ను గెలుచుకున్నా పట్టువదల్లేదు సాత్విక్ -- చిరాగ్. రెండో సెట్‌లో 21-17తో ప్రత్యర్థికి షాకిచ్చిన భారత జోడీ.. నిర్ణయాత్మక మూడో సెట్‌ను 21-16తో అలవోకగా గెలుచుకుంది. అంతే.. సింగపూర్ ఓపెన్ డబుల్స్‌లో విజేతగా నిలిచిన భారత జంటగా సాత్విక్ -- చిరాగ్ రికార్డు నెలకొల్పారు.



ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 1-6-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# నిస్వార్థం.. తల్లిదండ్రుల సేవ

మానవ సంబంధాలన్నింటిలోనూ అత్యంత పవిత్రమైనది, నిస్వార్థమైనది తల్లిదండ్రుల బంధం. పిల్లల ఉనికికి, వారి ఎదుగుదలకు మూలకారణం అమ్మానాన్నలే. సమాజంలో తల్లిదండ్రుల పాత్రను గుర్తిస్తూ, వారి త్యాగాలకు కృతజ్ఞత తెలపడానికి ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీన "ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం"గా జరుపుకుంటారు. 2012లో ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ ఈ రోజును అధికారికంగా ప్రకటించింది. పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యతను ఈ రోజు గుర్తు చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులందరినీ వారి నిరుపమానమైన త్యాగాలు, అంకితభావానికి గాను గౌరవించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. జాతి, కుల, మత భేదాలు లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకను నిర్వహిస్తారు. పిల్లలకి మొదటి పాఠశాల ఇల్లే అయితే, మొదటి గురువులు తల్లిదండ్రులే. నడక, నడవడిక, సంస్కారాలను వారే నేర్పుతారు. శారీరకంగా, మానసికంగా పిల్లలకు కొండంత అండగా నిలిచేది తల్లిదండ్రుల ప్రేమే. పిల్లల ఆసక్తులను గుర్తించి, వారి లక్ష్యాల వైపు నడిపించడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకం. ప్రస్తుత వేగవంతమైన ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. ఉద్యోగ ఒత్తిళ్ల వల్ల నేటి తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపలేకపోతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, సాంకేతికత పెరగడం వల్ల ఒకే ఇంట్లో ఉంటున్నా కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు తగ్గుతున్నాయి. పిల్లల ఉన్నత చదువులు, భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తీవ్రమైన ఆర్థిక భారాలను మోస్తున్నారు. చిన్నప్పుడు మనల్ని కంటికి రెప్పలా కాపాడిన తల్లిదండ్రులను, వారి వృద్ధాప్యంలో గౌరవంగా చూసుకోవడం ప్రతి ఒక్కరి కనీస ధర్మం. తల్లిదండ్రుల దినోత్సవం అనేది కేవలం ఒక రోజు శుభాకాంక్షలు చెప్పడానికో లేదా బహుమతులు ఇవ్వడానికో పరిమితం కాకూడదు. వారిని ప్రతిరోజూ ప్రేమించడం, గౌరవించడం మన బాధ్యత. తల్లిదండ్రులు సంతోషంగా ఉన్న కుటుంబాలే రేపటి దృఢమైన సమాజానికి అసలైన పునాదులు.

# దేవుని రథం.. సూపర్ టెక్నాలజీ

## దేవతల రాక.. పోకలు

సూర్య నారాయణుడు.. యహోవా.. అల్లా.. ఆదిశక్తి.. త్రిమూర్తులు యూదుల దేవుడు.. అంతా ఈ భూమ్మీదకు వచ్చి వెళ్తున్నారు.. చతుర్వేదాలు.. అష్టాదశ పురాణాలు.. ఇతిహాసాలు.. బైబిల్.. ఖురాన్ దేవతల రాకపోకలకు ప్రత్యక్ష సాక్ష్యాలు. ఇవి మిథ్య కాదు. పుక్కిటి కథలు కానే కావు. మానవుల కంటే సమర్థులు. వెయ్యిరెట్లు శక్తిమంతులు. కాల గమనాన్ని సైతం శాసించగలవారు. రోదసిలోంచి అనంత సౌరమండలం ఆవలి నుంచి జాడ తెలియని దేవలోకం నుంచి భూమ్మీదకు వచ్చివెళ్తున్నారు. లక్షల సంవత్సరాలుగా భూమికి వారు అతిథులు. భూమికి ఓ రూపాన్నిచ్చిన వారు. పంచభూతాలతో నిర్మాణం చేసిన వారు. మట్టిమనిషికి టెక్నాలజీ నేర్పిన వారు. అనంతశక్తి సంపన్నులు. అనంత కాంతిపుంజం వారిని ఆవరించింది. ఆకాశంలో ఉరుములు ఒరిగిపడుతున్నాయి. మబ్బులు జారిపోతున్నాయి.

**ఆకసాన్ని చీల్చుకుని అంతులేని వేగంతో భగవంతుడు దిగివస్తున్నాడు. మన ఇతిహాసాలు, మత గ్రంథాలు, గోడలపై శిల్పాలు, చిత్రాలు అన్నీ నిజమేనని ఇప్పుడు శాస్త్రవేత్తలు అంటున్నారు. టర్కీ.. ప్రపంచంలో అతి గొప్ప ఆర్కియాలజికల్ మాన్యుమెంట్స్కు ఈ చిన్న నగరం సెంటర్పాయింట్ అయింది. క్రీస్తు పూర్వం 1200లో ట్రోజన్ వార్కు ప్రధాన రణస్థలి టర్కీ, గ్రీకు ప్రాచీన చరిత్ర ప్రకారం ట్రోజన్లు అంటే దేవీ దేవతలన్న మాట.. దేవతలకు మరణం లేకపోయినప్పటికీ.. అప్పడప్పుడూ హర్ట్ అవుతుంటారట.. ఈ దేవతల మధ్య ప్రస్తుతం టర్కీ ఉన్న ప్రాంతంలో మహాయుద్ధం జరిగిందని కథనం.. రెండు శతాబ్దాల క్రితం వరకు ఇది ఒక కథగానే వుండిపోయింది. కానీ, క్రీస్తుశకం 1868లో ప్రముఖ ఆర్కియాలజిస్ట్ హెన్రిచ్ శీమన్ టర్కీలో ఈ యుద్ధం జరిగిన ప్రాంతాన్ని ఆధారాలతో సహా కనుగొన్నాడు. ట్రాయ్ వంశం పరిపాలించిన టర్కీలోని ఉత్తర ప్రాంతంలోనే దేవతల యుద్ధం జరిగిందని ప్రకటించాడు. శ్రీమన్ చెప్పిన మాటే నిజమైతే.. దేవతలు భూమ్మీదకు దిగి వచ్చినట్లే భావించాలి.. అదే వాస్తవమైతే గ్రీకుల ప్రాచీన ఇతిహాసాలు, పురాణాల్లోనూ వాస్తవాలున్నాయని అనుకోవాలి.**



అత్యంత శక్తిమంతులైన దేవతలు నిజంగానే ఉన్నట్లయితే వాళ్లంతా ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎలా వస్తున్నారు? దేవలోకం ఎక్కడుంది? గ్రీకు.. ప్రపంచంలోని తొలి నాగరికతలకు పుట్టినిల్లు.. ఇక్కడి పార్థనాన్ దేవాలయాన్ని చూసేందుకు రోజూ వేల మంది పర్యాటకులు వస్తుంటారు. ఈ ప్రాచీన నిర్మాణాలు.. ఈ భూమిని వేల, లక్షల సంవత్సరాల క్రితం మనుషుల కంటే శక్తిమంతులైన వారు పరిపాలించిన వైనానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. గ్రీకు ప్రాచీన ఇతిహాసాలు దేవతల గురించిన వివరాలు చాలా చెప్పుకుంటూ వచ్చాయి. దానికి సింబల్గా ఈ నిర్మాణాలు నిలుస్తున్నాయి. దేవతలు స్వర్గం నుంచి దిగి వచ్చారు. ప్రపంచంలోని అనేక మాన్యుమెంట్స్ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. దేవతలు నేలకు దిగి వచ్చేప్పుడు కాలానికి అతీతమైన వేగంతో వచ్చేవారట. వాళ్లు నేలకు దిగి వస్తున్నప్పుడు వారి చుట్టూ మబ్బులు ఆవరించి పొగలు కమ్ముకున్నట్లుగా ఉండేదిట. సూర్య కాంతికంటే ఎన్నో రెట్లు ఎక్కువ కాంతి వారితో పాటే భూమికి ప్రయాణించేదిట. ఇదెంత వరకు నిజం? ఒక్క గ్రీకులోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా.. అన్ని ప్రాంతాల్లో ఎవరికీ అంతుపట్టని విధంగా లభిస్తున్న వస్తువులు కానీ, బయటపడుతున్న నిర్మాణాలు కానీ, బెర్ముడా ట్రయాంగిల్ లాంటి ప్రాంతాల్లో పరిమితికి మించిన మాగ్నెటిక్ పవర్ దేవతల ఉనికి చాటుతున్నాయి. వాళ్లు భూమికి ఇప్పటికీ వస్తున్నారనే సైంటిస్టులు విశ్వసిస్తున్నారు. విశ్వంలో ఎక్కడో ఏదో ఒక చోట ఉన్నారని భావిస్తున్న గ్రహాంతర వాసులే మతాలు నమ్ముతున్న దేవీ దేవతలా? వీళ్లనే, అంటే ఈ గ్రహాంతర వాసులనే మన ప్రాచీనులు దేవతలుగా భావించి ఉండవచ్చు. స్టీఫెన్ హాకింగ్ వంటి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు చెప్తున్నట్లుగా ఏలియన్స్ ఉన్నాయన్న మాటే వాస్తవమైతే వీళ్లను మన పూర్వీకులు చూసి ఉంటారా? వీళ్లు మనకన్నా శక్తిమంతులై వాళ్ల నుంచి మేలును పొందారా? ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఒకే రకమైన ఆలోచన.. దేవతలు ఆకాశం నుంచి భూమ్మీదకు దిగివచ్చారు.. అన్ని మతాల్లోనూ ఒకే రకమైన అభిప్రాయం లేదా విశ్వాసం. దేవతలు మనకంటే శక్తిమంతులని.. దివ్యశక్తులు కలిగిన వారని.. ఈ భూమి వారి కనుసన్నల్లోనే ముందుకు సాగుతోందని.. ఎలా సాధ్యం? ప్రాచీన నాగరికతలకు సంబంధించి మనకు లభించిన చాలా ఆనవాళ్లు దాదాపు ఒకేలా ఉన్నాయి. ఇవన్నీ విశ్వ రహస్యాలను విప్పిచెప్పే ప్రాథమిక సాక్ష్యాధారాలుగా మనకు కనిపిస్తున్నాయి. కేవలం ఊహాపోహలే అయితే... ఇన్ని డిఫరెంట్ కల్చర్స్లో ఒకే రకంగా దేవీదేవతల రాకపోకల గురించి ఊహించటం సాధ్యమేనా? క్రీస్తుపూర్వం 3800 సంవత్సరం నాటి సుమేరియన్ నాగరికత ఆనవాళ్లలో

ఆకాశం నుంచి భూమికి దేవతలు దిగివచ్చిన లివింగ్బీయింగ్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి వచ్చిన దేవతలు మనుషులతో అనుబంధాలు పెంచుకున్నట్లు కూడా సుమేరియన్ చరిత్ర చెప్తోంది. దేవతలంటే గ్రహాంతర వాసులే కావచ్చు. కానీ, వాళ్లు సూపర్ నేచురల్ పవర్ ఉన్నవాళ్లు. వాళ్ళు మనిషితో మమకారం పెంచుకున్నారు. వీళ్లు దేవతలా కాదా అన్నది ఖచ్చితంగా చెప్పలేకపోయినప్పటికీ, మనకంటే శక్తిమంతులైన జీవులన్నది స్పష్టం. మన పూర్వీకులకు సాంకేతిక పరిజ్ఞానం కొరవడటం వల్ల వీళ్లను దేవుళ్లుగా భావించి ఉండవచ్చు. మౌంట్ ఒలింపస్.. గ్రీస్లో అత్యంత ఎత్తైన పర్వతం.. ప్రాచీన ఆధ్యాత్మిక వాదం ప్రకారం ఇది దేవుడి నివాసం.. యూదుల భగవంతుడు ఇక్కడ నివాసముంటాడట.. దీని శిఖరంపై భవ్యమైన మందిరం ఉందని.. సామాన్య మానవులకు ఇది కనిపించదని చెప్తారు. దాదాపు 52 శిఖరాలు ఉన్న ఈ ఒలింపస్ పర్వతం 12 మంది గ్రీకు దేవుళ్లకు ఆవాసంగా విశ్వసిస్తారు. నిజానికి ఇది ఏలియన్ల స్థావరమని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పర్వత ఉపరిభాగంపై తరచూ ఏలియన్లకు సంబంధించిన విమానాలు వచ్చి వెళుతుంటాయి.. ఈ శిఖరంపై తీవ్రమైన అయస్కాంత శక్తి ఉంటుంది. దీనిపై సాధారణ మనిషి పాదం మోపటం అంత ఈజీ కాదు. వాళ్లు ఈ ఒలింపస్ పర్వతంపై దిగుతున్నప్పుడు సామాన్యంగా ఉండదు.. ఒక పెద్ద పిడుగు ఉరుములతో కలిసి వచ్చేస్తుందిట.. వాళ్లు వచ్చినప్పుడు వెలువడే కాంతి వెలుగులను అంచనా వేయటం తేలిక కాదు.. ఈ పర్వతంపై దేవుడి కాంతి బంగారు వెండి వెలుగులతో నిండి ఉంటుంది. చేతిలో ఒక శక్తిమంతమైన ఆయుధాన్ని ధరిస్తాడు.. దాన్ని ప్రయోగించినప్పుడు అందులోనుంచి వేల వాట్ల విద్యుత్తు శక్తి వెలువడుతుంది. ఈ శక్తి ఒక్కసారిగా మొత్తం ప్రపంచాన్నే నాశనం చేస్తుంది. కొన్ని వందల సునామీలు.. భూకంపాలను సృష్టిస్తుంది. మనకు సూర్యుడు ప్రత్యక్ష నారాయణుడు.. గ్రీకులకు నారాయణుడంటే ఎవరో తెలుసా? అపోలో.. ఎస్ట్ బ్యూటిఫుల్ గాడ్ ఆఫ్ గ్రీక్.. అగ్ని రథంపై భూమ్మీదకు వచ్చేవాడట. భూమ్మీద మనుషులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన దేవుడు అపోలో.. భారతీయులకు త్రిమూర్తులు ఎలాంటి వారో.. గ్రీకు నాగరికతలో అపోలో ఈశ్వరుడితో



- కోవెల సంతోష్ కుమార్,
రచయిత
91 9052116463

సమానమన్నమాట. క్రిస్టియానిటీ, ఇస్లాం వంటి మతాలు ఆవిర్భవించటానికి ముందు విలసిల్లిన నాగరికతల్లో భగవంతుడిని మనుషులు దర్శించుకున్నారనే చెప్తారు.. వాళ్లు చూసింది దేవతలనేనా? సూపర్ నేచురల్ బీయింగ్స్ నే దేవతలని భ్రమిస్తున్నారా? అపోలో.. అగ్ని రథాన్ని ఎక్కి వస్తుంటే నిప్పుకణికలు విశ్వమంతా విరజిమ్ముతూ ఉండేవట.. ఆయన రథానికి రకరకాల జంతువులు సారథ్యం వహించేవట. ఈయనే భూమి మీద నిర్మాణపు పరిజ్ఞానాన్ని మనిషికి అందించిన వాడు, పర్వతాలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలి.. భూమ్మీద ఎలాంటి నిర్మాణాలు ఉండాలి అన్న విషయాలపై మనిషికి అవగాహన కల్పించిన వాడు.. ఖగోళ శాస్త్రాన్ని గ్రీకులకు అందించిన వాడు అపోలో.. కాలక్రమంలో గ్రీకు దేవతలే, రోమన్ల దేవుళ్లుగా ట్రాన్స్ఫామ్ చెందారు. వాయవ్య ఫ్రాన్స్లో ఒక ప్రాంతంలో దాదాపు రెండు మైళ్ల విస్తీర్ణంలో ఒక విచిత్రమైన రాళ్లు వరుసల్లో నిలబెట్టి ఉన్నాయి. ఇవన్నీ దాదాపు క్రీస్తుపూర్వం 4500 సంవత్సరాల క్రితం నాటివి.. రాతియుగం ముగింపు సందర్భంలోనివని ఒక అంచనా... ఒక్కొక్కటి 350 టన్నులు బరువున్న రాళ్లను ప్రీహిస్టారిక్ ప్రజలు ఎందుకు ఉంచారు? ఇవి సహజంగా ఏర్పడినవి ఎంతమాత్రం కావు.. వీటిని జాగ్రత్తగా గమనిస్తే.. టిపికల్ ట్రయాంగిల్ షేప్లో కనిపిస్తాయి. మాథమెటిక్స్లోని పైథాగ్రస్ సిద్ధాంతాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయి. రాతియుగం నాటి ప్రజలకు ఈ సిద్ధాంతం తెలిసే అవకాశమే లేదు. అలాంటప్పుడు ఈ రాళ్ల ఏర్పాటు ఏన్షియెంట్ గాడ్స్ పనా? వాళ్ల మార్గదర్శనంలో మనుషులు చేసిన మహా నిర్మాణాలేనా? నోర్స్.. స్కాండినేవియా ప్రాంతంలో విస్తరించిన ఆధ్యాత్మిక నాగరికత.. నోర్స్ మైథాలజీకి.. గ్రీకు మైథాలజీకి చాలా పోలికలున్నాయి. వీళ్ల దేవీ దేవతల రూపాల్లోనూ పోలికలున్నాయి. గ్రీకుల జ్యూస్.. నోర్స్కు చెందిన ఓడెన్కు సంబంధించిన చరిత్ర దాదాపు ఒకే విధంగా కనిపిస్తుంది.. ఇతని ఆయుధం శక్తిమంతమైన సుత్తి. దీనితో అతను దేన్నైనా విధ్వంసం చేయగలడు.. ఇక మన దేశానికి వస్తే మహాభారతంలో కానీ, అష్టాదశ పురాణాల్లో కానీ, వేదాలు కానీ, విస్పష్టంగా దేవీ దేవతల రాకపోకల గురించిన విశ్లేషణ విస్తారంగా జరిగింది.. వాళ్లు వచ్చి భూమిపై మనుషులకు సహాయ సహకారాలను అందించటమూ తెలుసు. దేవతలు సాఫిస్టికేటెడ్ మెషిన్లలో ప్రయాణించే వారట.. దీన్ని మనవాళ్లు విమానాలు అన్నారు.. ఇతరులు యుఎఫ్తొలుగా చెప్పుకున్నారు.. ప్రాచీన కథనాలు.. అన్ని మైథాల జీలన్నీ దేవీదేవతల రాకపోకలను నిర్ధారించాయి. వాటికి ఇప్పటి పరిశోధనలు బలం చేకూరుస్తున్నాయి. ఇతర గ్రహాల నుంచి యుఎఫ్తొలు భూమ్మీదకు రావటం గ్రహాంతర వాసులు వచ్చి వెళ్తున్నారన్న డాక్యుమెంట్ ఎవిడెన్స్ దేవతలున్నారన్న కథనాలను మరింత నిజం చేస్తున్నాయి. వాళ్లు ఇప్పుడూ వస్తున్నారా? అంటే దానికి మాత్రం ఎవరి దగ్గరా జవాబు లేదు.. మనుషులు ప్రవేశించని ప్రదేశాలకు వాళ్లు వచ్చి వెళ్తున్నారన్న సంకేతాలను ఏలియన్ సైంటిస్టులు నిజం అంటున్నారు.. ఏలియన్లు హ్యూమన్ డిఎన్ఏపై ప్రయోగాలు కూడా చేస్తున్నారని వాళ్ల అనుమానం. వేల సంవత్సరాలుగా దేవతలతో మనిషికి ఉన్న సంబంధాలను గురించిన చర్చ జరుగుతూనే ఉంది. నిజాలు మాత్రం ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. గ్రహాంతర వాసుల అస్తిత్వం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. అనంత విశ్వంలో మనం ఒంటరి వాళ్లం కాదని, ఎక్కడో ఏదో గ్రహంలో జీవులు ఉన్నారని సైంటిస్టులు బల్లగుద్ది వాదిస్తున్నారు.. వాళ్లు దేవతలా? లేక కేవలం మనలాగే ఇతర గ్రహాల్లో నివసిస్తున్న జీవులా? ఈ విషయం తేలటానికి ఎంత టైం పట్టినా... దేవతలు లేదా గ్రహాంతర వాసులు ఈ భూమ్మీదకు వచ్చి వెళ్లారన్నది మాత్రం వాస్తవం. మనకు మేలు చేసి వెళ్లారన్నదీ నిజం.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.